నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644


నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

చెదలువంటిదంట చెప్పుడు మాటలు
వినకుమయ్య నీవు విస్తుపోయి
చెప్పబోకునవియు చెడ్డవాడందురు
తెలిసిమసలుకొనుము తెలివితోడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 199 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 29-10-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




# కీలక ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో..

- భారీ ఉపగ్రహాన్ని నింగిలోకి మోసకెళ్లనున్న ఎల్‌వీఎం 3 రాకెట్..!

న్యూఢిల్లీ

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం సీఎంఎస్-3ని నింగిలోకి పంపనున్నది. ఇండియన్ నేవీ కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఉపగ్రహాన్ని నింగిలోకి పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. ఎల్‌వీఎం 3 రాకెట్ ఈ ఉపగ్రహాన్ని నవంబర్ 2న నింగిలోకి మోసుకెళ్లనున్నది. ఏపీలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగాన్ని ఇస్రో చేపట్టనున్నది. ఈ ఉపగ్రహాన్ని జీశాట్ 7ఆర్ అని పిలుస్తుంటారు. ఇది శాటిలైట్‌ను పూర్తిగా భారత సైన్యం అవసరాల కోసం తయారు చేసిన మల్టీ బ్యాండ్ కమ్యూనికేషన్ శాటిలైట్.దీని బరువు దాదాపు 4,400 కిలోల వరకు ఉంటుంది. ఇస్రో తొలిసారిగా భారీ బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌ను భూస్థిర బదిలీ కక్ష్యలోకి ప్రవేశపెట్టనుండడం విశేషం. ఈ శాటిలైట్ భారత భూభాగంతో పాటు సముద్ర జలాల్లోనూ సేవలందిస్తుందని ఇస్రో తెలిపింది. ఈ శాటిలైట్ 2013లో ప్రయోగించిన జీశాట్ 7 రుక్మిణి స్థానంలో సేవలు అందించబోతున్నది. అడ్వాన్స్‌డ్ పేలోడ్స్‌తో తయారు చేసిన ఈ శాటిలైట్ హిందూ మహాసముద్రంతో పాటు

-మిగతా 2 లో

# సినీ కార్మికులకు ప్రభుత్వం అండ

**ఆస్కార్ స్థాయికి సినీ పరిశ్రమను తీసుకెళ్లిన ఘనత మీదే**

- టిక్కెట్ల రేట్లలో కార్మిక సంక్షేమం కోసం 20శాతం
- ఆరోగ్యశ్రీ, ఇళ్ల స్థలాలు, పిల్లలకు ప్రత్యేక స్కూలు
- సినీకార్మిక సంఘం సన్మాన సభలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ క్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ప్రపంచ సినీ పరిశ్రమకు హైదరాబాద్ నగరం వేదిక కావాలనేది తన సంకల్పమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సినీ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. యూసుఫ్‌గూడలో నిర్వహించిన సినీ కార్మికుల అభినందన సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినీ కార్మికుల సంక్షేమంపై సీఎం పలు కీలక హామీలు ఇచ్చారు. కృష్ణా నగర్‌లో మూడు నుంచి నాలుగు ఎకరాల్లో కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాల నిర్మిస్తాం. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం

-మిగతా 2 లో





# ఏఐ టెక్నాలజీతో అప్రమత్తం

- డీప్‌ఫేక్ మోసాలతో జాగ్రత్త
- సేఫ్‌వర్డ్ టెక్నిక్ సూచించిన సీపీ సజ్జన్నార్

హైదరాబాద్,క్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు మన జీవితంలో కీలకంగా మారింది. ఈ టెక్నాలజీ ఎంత శక్తివంతమైందో, అంతే ప్రమాదకరంగా కూడా మారుతోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా మన ముఖం, మన గొంతును కూడా కచ్చితంగా నకిలీగా సృష్టించడం సాధ్యమైంది. ఇప్పుడు ఎవరికైనా మీ వీడియో లేదా వాయిస్‌ను వాడి, మీరు మాట్లాడుతున్నట్టుగా నకిలీ సందేశాలు పంపడం, వీడియోలు తయారు చేయడం లేదా కాల్స్ చేయడం సాధ్యమవుతోంది. దీంతో వ్యక్తిగత, ఆర్థిక మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. తాజాగా పలు దేశాల్లోనే కాకుండా మన దేశంలో కూడా డీప్‌ఫేక్ ఆధారంగా మోసాలు

-మిగతా 2 లో

# సిద్ధరామయ్యకు ఎదురుదెబ్బ..!

- ఆర్ఎస్ఎస్ బ్యాన్‌పై హైకోర్టు స్టే..!
- విచారణను నవంబర్ 17వ తేదీకి వాయిదా



న్యూఢిల్లీ

కర్నాటక హైకోర్టులో సిద్ధరామయ్య సర్కారుకు ఎదురుదెబ్బ తగిలింది. అయితే, ప్రభుత్వ ప్రాంగణాల్లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని.. నిర్వహించే ముందు ప్రైవేటు సంస్థలు పరిపాలనా అనుమతులు పొందాలని కర్నాటక ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఉత్తర్వులు ఆర్ఎస్ఎస్ లక్ష్యంగా చేసుకున్నట్లుగా ఆరోపణలు వచ్చాయి. ఈ ఉత్తర్వులను కర్నాటక హైకోర్టు ధార్వాడ్ బెంచ్ ఉత్తర్వులు నిలిపివేసింది. పునస్తైతన్య సేవా సమస్త అనే సంస్థ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ నాగప్రసన్న బెంచ్ విచారించింది. ప్రభుత్వ ఉత్తర్వులపై మధ్యంతర స్టే ఇస్తూ.. విచారణను నవంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. సంస్థ తరపున సీనియర్ న్యాయవాది

-మిగతా 2 లో

# పాకిస్థాన్ బరితెగింపు..

- భారత పోస్టులపై దాడులు



న్యూఢిల్లీ

ఆపరేషన్ సింధూర్ తో తీవ్రంగా దెబ్బకొట్టినా పాకిస్థాన్ సైన్యం తీరుమారలేదు. మరోసారి బరితెగించి కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచింది. సరిహద్దుల్లో భారత స్థావరాలపై కాల్పులకు పాల్పడింది. జమ్ముకశ్మీర్ లోని లీపా వ్యాలీ లో అక్టోబర్ 26, 27 తేదీల నడుమ వచ్చే రాత్రి ఈ ఘటన జరిగింది.కాల్పులు, మోర్టార్ దాడులకు పాల్పడింది. అయితే భారత సైన్యం పాకిస్థాన్‌కు ధీటుగా బదులిచ్చింది. పాకిస్థాన్ దాడిని సమర్థంగా తిప్పికొట్టింది. భారత జవాన్‌లు తీవ్రంగా ప్రతిఘటించడంతో పాక్ సైనికులు తోకముడిచారు. కాగా పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా అప్పట్లో ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత సైన్యం పాకిస్థాన్‌పై సర్జికల్ స్ట్రైక్స్‌కు పాల్పడింది. దాంతో పాక్ కాళ్లబేరానికి వచ్చింది. ఫలితంగా ఈ ఏడాది మే 10 నుంచి రెండు దేశాల సైనికుల మధ్య నియంత్రణ రేఖ వెంబడి ఎలాంటి ఘటనలు చోటుచేసుకోలేదు. అంతా ప్రశాంతంగా ఉంది. కానీ తాజాగా పాకిస్థాన్ మళ్లీ బరితెగించడం ఆ దేశం వక్రబుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది.

# కేసులు నిజమైతే హైదరాబాద్ వీడుతా

- లేదంటే కేటీఆర్, హరీష్ రావు వీడుతారా
- జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ సవాల్



హైదరాబాద్, క్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ , బీఆర్ఎస్ నేతల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ పై బీఆర్ఎస్ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. దీనికి ప్రతిగా నవీన్ యాదవ్ బీఆర్ఎస్ నాయకులకి గట్టి సవాల్ విసిరారు. తన మీద పెట్టిన కేసులు నిజమైతే

-మిగతా 2 లో

# ఢిల్లీలో మేఘ మథనం విఫలం

- ఢిల్లీలో వాతావరణ కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి



2లో

# హరీష్ రావుకు పితృవియోగం

**తండ్రి సత్యానారాయణ కన్నుమూత**



- బావకు నివాళి అర్పించి..అక్కను ఓదార్చిన కేసీఆర్
- కేటీఆర్, బీఆర్ఎస్ నేతల నివాళి
- మంత్రులు పొన్నం తదితరుల నివాళి
- సంతాపం తెలిపిన సీఎం రేవంత్, వైఎస్ జగన్

హైదరాబాద్, క్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఇంట విషాదం నెలకొంది. హరీశ్ తండ్రి తన్నీరు సత్యనారాయణ కన్నుమూశారు. హైదరాబాద్ కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఆయన పార్థివ దేహాన్ని ఉంచారు. హరీశ్‌రావుకు పితృవియోగంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం ఫిల్మ్ నగర్ మహాప్రస్థానంలో నిర్వహించారు. తన్నీరు సత్యనారాయణ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు.

-మిగతా 2 లో



# జూబ్లీహిల్స్‌లో ఆ రెండు పార్టీలను బొందపెట్టండి



- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో ఒరిగిందేమీ లేదు
- అభివృద్ధి కావాలంటే బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి
- ప్రచారంలో ఏంపి ఈటెల రాజేందర్ పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
జూబ్లీహిల్స్ అంటే హైదరాబాద్‌లో రిచెస్ట్ ప్లేస్ కానీ ఈ నియోజకవర్గం లోని బస్తీల ప్రజల బాధలు మాత్రం వర్ణనాతీతమని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా మంగళవారం ఆయన నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్

-మిగతా 2 లో

# తుఫాన్ ప్రభావంపై చంద్రబాబు సమీక్ష




- పునరావసం చర్యలకు ప్రత్యేక శ్రద్ధ
- ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు

అమరావతి,

మొంథా తుపాను ప్రభావంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మంత్రులు, పలు శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అనిత, నారాయణ హాజరయ్యారు. తుపాను నేపథ్యంలో ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సహాయక చర్యలు, పునరావాసం, నష్టం అంచనా అంశాలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు సీఎం చంద్రబాబు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. డ్రోన్లతో ముంపు ప్రాంతాల్లో చర్యలు చేపట్టాలని సూచించారు. వాగులు పొంగే అవకాశం

-మిగతా 2 లో

# కీలక ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో..

మొదటి తరువాయి

కీలక ప్రాంతాల్లో నేవీ కార్యకలాపాలు కొనసాగించే సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. వాయిస్, డేటా, వీడియో లింక్‌ల కోసం సీ, ఎక్స్‌టెండెడ్ సీ, క్యూ-బ్యాండ్స్‌లో కమ్యూనికేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయి. సైనిక అవసరాలతో పాటు మారుమూల ప్రాంతాల్లోని పౌర ఏజెన్సీలకు సైతం మెరుగైన డిజిటల్ సేవలు అందించడంలో జీశాట్ 7ఆర్ ఉపయోగపడనున్నది. ఈ ఉపగ్రహాన్ని రాకెట్‌తో అనుసంధానించి.. ఈ నెల 26న లాంచ్ ప్యాడ్‌పైకి తరలించినట్లు ఇస్రో పేర్కొంది. చంద్రయాన్-3 మిషన్‌ను విజయవంతంగా మూసుకెళ్లిన ఎల్‌వీఎం 2 రాకెట్‌కు ఇదో ఐదో మిషన్ కానున్నది. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది చివరలో ఇస్రో మరో భారీ శాటిలైట్ ప్రయోగం చేపట్టనున్నది. యూఎస్‌కు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ తయారు చేసిన 6.5 టన్నుల బరువున్న బ్లూబర్డ్-6 శాటిలైట్‌ను సైతం ఇదే ఎల్‌వీఎం 3 రాకెట్ నింగిలోకి మూసుకెళ్లనున్నది. ఇందుకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు.

# ఏఐ టెక్నాలజీతో అప్రమత్తం

మొదటి తరువాయి

జరుగుతున్నాయి. కొంతమంది మోసగాళ్లు మీ స్నేహితులు, బంధువులు, సహచరులు లేదా అధికారులుగా నటిస్తూ డబ్బు లేదా వ్యక్తిగత సమాచారం తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి మోసాలను గుర్తించడం చాలా కష్టంగా మారింది, ఎందుకంటే అవి నిజంగా ఉన్నట్లే కనిపిస్తాయి. ఇలాంటి మోసాల నుంచి రక్షణ పొందేందుకు ఒక సులభమైన కానీ అత్యంత ప్రభావవంతమైన పద్ధతి 'సేఫ్ వర్డ్'. అది మీరు మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సహచరులతో మాత్రమే పంచుకునే ఒక ప్రత్యేక పదం లేదా సంకేతం. ఏదైనా అనుమానాస్పద కాల్ లేదా మెసేజ్ వస్తే, ఆ వ్యక్తి నిజమా కాదా తెలుసుకోవడానికి ఆ 'సేఫ్ వర్డ్' అడగాల్సి ఉంటుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ ఈ విషయంలో ప్రజలకు హెచ్చరిక చేశారు. ఇలాంటి విషయాల్లో జాగ్రత్త అవసరమని అన్నారు. సేఫ్ వర్డ్ ఎలా ఉపయోగించాలంటే.. మీకు అత్యంత నమ్మకమైన వారితో ఒక ప్రత్యేక సేఫ్ వర్డ్ నిర్ణయించుకోండి. అనుమానాస్పద కాల్ లేదా మెసేజ్ వచ్చినప్పుడు ఆ వర్డ్ అడిగి ధృవీకరించండి. ఆ సేఫ్ వర్డ్‌ను బయట ఎవరితోనూ పంచుకోకండి. బ్యాంక్ వివరాలు, క్షిఖలు లేదా వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకండి. ఏఐ మన జీవితాన్ని సులభతరం చేస్తుంది, కానీ అదే మన భద్రతకు ప్రమాదం కావచ్చు. టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండటం, కొత్త మోసాలపై అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యం. 'సేఫ్ వర్డ్' వంటి చిన్న జాగ్రత్త ? పెద్ద ప్రమాదాల నుంచి మిమ్మల్ని కాపాడగలదన్నారు. ఇలాంటి మోసాలపై అవగాహన పెంచే ప్రయత్నంగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఎక్స్ లో ఒక హెచ్చరిక పోస్టు చేశారు. ఏఐ టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందుతుందో, అంతే జాగ్రత్త అవసరం అని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ భద్రత కోసం 'సేఫ్ వర్డ్' విధానం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఒక చిన్న జాగ్రత్త ? పెద్ద మోసాల నుండి కాపాడుతుంది అంటూ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# కేసులు నిజమైతే హైదరాబాద్ వీడుతా

మొదటి తరువాయి

తాను రాజకీయాలని వదిలి.. హైదరాబాద్ విడిచి వెళ్లిపోతానని ఛాలెంజ్ చేశారు. కానీ ఆ కేసులు ఫాల్స్ అని తేలితే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రాజకీయాల నుంచి తప్పుకోవడానికి సిద్ధమా..? అంటూ సవాల్ విసిరారు. కేసీఆర్ ప్రభుత్వం తనపై, తన కుటుంబ సభ్యులపై, అనుచరులపై ఒకే సంవత్సరంలో 20 నుంచి 30 తప్పుడు కేసులు పెట్టిందని ధ్వజమెత్తారు. తన మీద రౌడీ అని ప్రచారం చేయడంపై బీఆర్ఎస్ నేతల కుట్ర ఉందని విమర్శించారు నవీన్ యాదవ్. తనకు న్యాయవ్యవస్థ నమ్మకం కలిగించిందని.. తనను కాపాడిందని ఉద్ఘాటించారు. అలాగే, కాంగ్రెస్ ప్రచార రథాన్ని తగులబెట్టే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలపై కూడా కేసు నమోదైందని తెలిపారు. పోలీసులు ఈ విషయంపై చర్య తీసుకుంటారని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌పైన విశ్వాసం ఉంచారని నవీన్ యాదవ్ నొక్కిచెప్పారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కాంగ్రెస్ గెలుపుతోనే సాధ్యమవుతుందని నవీన్ యాదవ్ స్పష్టం చేశారు.

# సిద్ధరామయ్యకు ఎదురుదెబ్బ..!

మొదటి తరువాయి



అశోక్ హర్నహళ్లి వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కులపై పరిమితి విధించడమేనని వాదించారు. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం.. 10 మంది కంటే ఎక్కువ మంది సమావేశమైతే ప్రభుత్వ అనుమతి అవసరమని.. ఇది రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులపై పరిమితి విధించడమేనని.. ఒక పార్కులో కార్యక్రమం నిర్వహించినా.. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అది చట్టవిరుద్ధమవుతుందన్నారు. ప్రభుత్వం తరఫున న్యాయవాది స్పందించేందుకు సమయం కోరగా.. ఉత్తర్వులపై హైకోర్టు ధార్వాడ్ బెంచ్ మధ్యంతర స్టే విధించింది. కర్నాటకలో ఏదైనా ప్రభుత్వ ఆస్తి, ప్రాంగణాల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రైవేటు సంస్థలు ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. 10 మందికి పైగా సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించడం, బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, ప్రభుత్వ ప్రాంగణాల్లో అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించడంపై నిషేధం విధించింది. హైకోర్టు స్టేపై బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర స్వాగతించారు. సిద్ధరామయ్య ప్రభుత్వానికి, ప్రియాంక్ ఖర్గేకు పెద్ద దెబ్బలాంటిదన్నారు.

# సినీ కార్మికులకు ప్రభుత్వం అండ

మొదటి తరువాయి



లంచ్ కూడా అందిస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు ఉచిత వైద్యం కూడా అందిస్తాం అని చెప్పారు. తన మాటకు కట్టుబడి కృష్ణానగర్‌కు వచ్చానని గుర్తుచేసిన రేవంత్.. కార్మికుల కోసం ప్రభుత్వం చేయాల్సిన పనులు చేస్తాం. వెల్ఫేర్ ఫండ్‌కు 10 కోట్లు ఇస్తున్నాం. కష్టాల్లో ఉన్న కార్మికుల కోసం ఆ నిధులు వినియోగించండని అన్నారు. అంతేకాకుండా, సినిమా టికెట్ రేట్లు పెంచాలంటే కార్మికులకు 20 శాతం వాటా తప్పనిసరి ఇవ్వాల్సిందేనని అన్నారు.. ఆ వాటా వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ అవ్వాలి. లేదంటే టికెట్ ధరల పెంపుకు జీఓ ఇవ్వం అని స్పష్టం చేశారు. నిర్మాతలు, కార్మికులు కుటుంబ సభ్యుల్లా ఉండాలని సూచించారు. ఫైటర్స్, టెక్నీషియన్ల నైపుణ్యం పెంచేందుకు ఫ్యూచర్ సిటీలో భూమి కేటాయిస్తామని తెలిపారు. మీకు అవసరం ఉన్నప్పుడు మీకు అందుబాటులో ఉంటా. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెన్నంటి ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. సినీ కార్మికుల శ్రమ నాకు బాగా తెలుసు. మీ కష్టాలు తెలుసుకోలేనంతగా నా కళ్లు మూసుకోలేదని పేర్కొన్నారు. సినీ పరిశ్రమకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని సీఎం హామీ ఇచ్చారు. ఒకప్పుడు సినీ పరిశ్రమ అంటే మద్రాసే అనుకునే వారు. కానీ, నేడు తెలుగు సినిమా ఆస్కార్ అవార్డుల వరకు వెళ్లగలిగింది. ఈ గౌరవం తెర వెనుక కష్టపడే కార్మికుల శ్రమ ఫలితమే అని రేవంత్ అభినందించారు. నిలిచిపోయిన నంది అవార్డులను ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరుతో అవార్డులను ఇస్తున్నామని సీఎం తెలిపారు. హాలీవుడ్ కూడా తెలంగాణకు వచ్చి షూటింగ్ చేసుకునేలా మారాలి. చిన్న సినిమాలను తక్కువ చేసి చూసే ప్రసక్తే లేదు. ఐటీ రంగానికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, సినిమా పరిశ్రమకూ అంతే ప్రాధాన్యత ఇస్తాం అని ఆయన అన్నారు. ఐటీ, ఫార్మా పరిశ్రమలు ఎలాగో.. ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా అంతే. మీరు అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా. హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్‌లో షూటింగ్‌లు జరిగేలా బాధ్యత తీసుకుంటాం. ప్రభుత్వం చేయగలిగిన పనులు చేస్తాం. సినిమా టికెట్ల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో 20శాతం కార్మికులకు ఇవ్వాలి. కార్మికులకు లాభాల్లో 20శాతం ఇస్తేనే టికెట్ల ధరలు పెంచుకునేందుకు జీవో ఇస్తాం. త్వరలోనే సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం అని సీఎం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేసినట్లు చెప్పిన సీఎం రేవంత్. 1964లో నంది అవార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. హైదరాబాద్ కు సినీ పరిశ్రమ రావడంలో మర్రిచెన్నారెడ్డి పాత్ర కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఎంతో మందిని సంప్రదించి పరిశ్రమను తెచ్చారని గుర్తుచేశారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికులను ఆదుకున్నారని.. కార్మికుల కోసం పది ఎకరాలు ఇచ్చారని తెలిపారు. పరిశ్రమను ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు సీఎం. సినీ కార్మికులకు ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిర్మాత, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు , పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ రావుకు పితృవియోగం

మొదటి తరువాయి



తన బావతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకుని, ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సమాచారం తెలిసిన వెంటనే హరీశ్ రావును ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కోకాపేటలోని హరీశ్ రావు నివాసానికి వెళ్లి, దివంగత సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. తన సోదరిని, కుటుంబ సభ్యులను ఓదార్చనున్నారు. భర్తను కోల్పోయిన అక్క లక్ష్మమ్మకు కేసీఆర్ ధైర్యం చెప్పారు. ఇక హరీశ్‌రావును గుండెలకు హత్తుకుని కేసీఆర్ ఓదార్చారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తన్నీరు సత్యనారాయణ రావు కన్నుమూశారు. ఆయన పార్థివ దేహానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఉన్న ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. హరీశ్ రావును, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సతీమణి శోభ.. హరీశ్ రావును ఓదార్చారు. సత్యనారాయణ రావు భౌతికకాయానికి నివాళు లర్పించారు. అదేవిధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బిగాల గణెశిశ్ గుప్తా, మెతుకు ఆనంద్, హరీశ్ రావును పరామర్శిం చారు. సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళు లర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు నివాళి అర్పించారు. అలాగే సిఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. కటుఉంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఏపి మాజీ సిఎం జగన్ తదితరులు కూడా సంతాపం ప్రకటించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతి పట్ల ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంతాపం తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా విచారం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు తండ్రి మృతి పట్ల ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. సత్యనారాయణ రావు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిన ప్రార్థించారు. ఈ నేపథ్యంలోనే వైఎస్ జగన్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడి సానుభూతి తెలియజేశారు.

# జూబ్లీహిల్స్‌లో ఆ రెండు పార్టీలను బొందపెట్టండి

మొదటి తరువాయి

మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో ఆ రెండు పార్టీలను బొందపెడితేనే చలనం వస్తుందని ప్రజలకు సూచించారు. పెన్షన్లు రావాలన్నా, డబుల్ బెడ్ రూం ఇళ్లు రావాలన్నా, మురికి కాలువలు కట్టాలన్నా, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే వారి మెడలు వంచి బీజేపీ కొట్లాడుతుందని ఎంపీ ఈటల స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి ఓటు వేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. దీపక్ రెడ్డి ఇప్పటికే ఇక్కడ పోటీ చేసి ఉన్నారని గుర్తు చేశారు. ఆ క్రమంలో ఆయన అందరికి సుపరిచితుడన్నారు. తాను మూడవ రోజు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నానన్నారు. అయితే పేరుకే జూబ్లీహిల్స్.. పారే మురికి కాలువలు, కంపు వాసనలు, గతుకుల రోడ్లు ఏ పేదవాడిని కదిలించినా మమ్మల్ని పట్టించుకునే వారే లేరని ఆవేదన చెందుతున్నారని తెలిపారు. భర్త చనిపోయి ఐదేళ్లు అయినా.. 65 ఏళ్ళు దాటినా తమకు పెన్షన్ రావడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో టిఆర్ఎస్ పార్టీ ఇస్తామంటూ మోసం చేసిందని.. ఇవన్నీ ఇస్తారని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఆ పార్టీ సైతం తమను మోసం చేసిందని ప్రజలు మండిపడుతున్నారని చెప్పారు. పెన్షన్లు లేవు, ఇళ్లు లేవు, మురికి కాల్వలు సరిగా లేవు, తాగే నీరు సైతం సరిగ్గా రావడం లేదని బస్తీల ప్రజలు చెబుతున్నారన్నారు. బిఆర్ఎస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టామని.. కాంగ్రెస్ పార్టీకి సైతం అదే గతి పడుతుందని వారు అంటున్నారని చెప్పారు. 40 ఏళ్ల క్రితం ఎలా ఉందో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అలాగే ఉందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. మంత్రుల మధ్య సమన్వయం లేదని చెప్పారు. మంత్రులకు డబ్బులు సంపాదించుకోవడానికి, దోచుకోవడానికే సమయం సరిపోతుంది తప్ప ప్రజలను పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రజల సమస్యలపై అసెంబ్లీ వేదికగా కొట్లాడుతున్నది బీజేపీ మాత్రమేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఇది కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. ఆ క్రమంలో ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. తమ పార్టీ కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, లీడర్లు ఇలా ప్రతి ఇంటికి వెళ్ళి ప్రచారం చేస్తున్నారని గుర్తు చేశారు.

## తుఫాన్ ప్రభావంపై చంద్రబాబు సమీక్ష

మొదటి తరువాయి

ఉన్నచోట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కాల్వలు, చెరువులకు గండ్లుపడకుండా పర్యవేక్షణ ఉండా లని మార్గనిర్దేశర చేశారు. లంక గ్రామాల ప్రజలను రిలీఫ్ క్యాంపులకు త్వరితగతిన తరలించాలని సూచించారు సీఎం చంద్రబాబు. విద్యుత్ సరఫరాపై ఫోకస్ పెట్టి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆజ్ఞాపించారు. తుపాను తీరం దాటిన తర్వాత భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. పునరావాస శిబిరాల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. అధికారులు - ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. అయితే, ఈరోజు అర్ధరాత్రి వరకు సచివాలయంలోనే సీఎం చంద్రబాబు ఉండనున్నారు. మొంథా తీవ్ర తుపాన్‌పై ఎప్పటికప్పుడు అధికారులతో చంద్రబాబు సమీక్షిస్తున్నారు. రెవెన్యూ, ఐటీ, హోంమంత్రి, అధికారులతో ఎప్పటికప్పుడూ మొంథా తుపాను వివరాలు తెలుసుకుంటున్నారు సీఎం చంద్రబాబు.

## ఢిల్లీలో మేఘ మథనం విఫలం

న్యూఢిల్లీ



దీపావళి తర్వాత ఢిల్లీలో వాతావరణ కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. దీంతో వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు మంగళవారం ప్రభుత్వం చేపట్టిన 'మేఘ మథనం' (క్లౌడ్ సీడింగ్) విఫలమైంది. ప్రక్రియ పూర్తయి నాలుగు గంటలైనా వర్షాలు కురవకపోవడం అందరినీ నిరుత్సాహపర్చింది. ప్రయోగానికి ఉపయోగించిన విమానం కాన్పూర్ నుంచి బయల్దేరి 6,000 అడుగుల ఎత్తులో రసాయనాలను వెదజల్లింది.

## 2025 అక్టోబర్ 29, బుధవారం తెలుగు పంచాంగం




మాసం - పక్షం
కార్తీక మాసం
శుక్ల పక్షం
తిథి
నవమి: అక్టోబర్ 28 రా. 11:32 అక్టోబర్ 29 రా. 12:26 వరకు
దశమి: అక్టోబర్ 29 రా. 12:26 అక్టోబర్ 30 రా. 1:21 వరకు
నక్షత్రం
ధనిష్ఠ: అక్టోబర్ 28 రా. 8:48 అక్టోబర్ 29 రా. 9:14 వరకు
శతభిషం: అక్టోబర్ 29 రా. 9:14 అక్టోబర్ 30 రా. 9:46 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:50- 5:34
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:37 - 12:21
అమృతకాలం: ఉదయం 6:10 - 7:52
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 12:10 - 1:39
యమగండం: ఉదయం 7:47 - 9:15
గుళికా: ఉదయం 10:44- 12:12
దుర్ముహూర్తం: ఉదయం 11:35 - 12:23, మధ్యాహ్నం 2:45 - 3:33
వర్జ్యం: ఉదయం 6:54 - 8:30

# పిల్లల భద్రత, విద్యార్థుల సంక్షేమం, వర్షాలపై కేంద్ర మంత్రి స్పందన




**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలోని ఓ పాఠశాలలో విద్యార్థులపై లైంగిక వేధింపుల కేసులో అటెండర్ యాకుబ్ పాషా పై పోక్సో చట్టం కింద ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. ఘటనను దాచిపెట్టిన హెడ్మాస్టర్ టీ. కమలను సస్పెండ్ చేశారు. ఇతర సిబ్బంది పాత్రపై విచారణ కొనసాగుతోంది. “వారి పాత్ర ఉంటే వారిపైనా పోక్సో కేసు నమోదు చేయాలి” అని కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచించారు. “విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో మీడియా సంయమనంతో వ్యవహరించాలి, తల్లిదండ్రులకు భరోసా కల్పించాలి” అని అన్నారు.వంగర గురుకుల పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య ఘటనపై స్పందిస్తూ “ఇది దారుణం. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనల్లోనూ గురుకులాల్లో ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. విద్యార్థుల మానసిక స్థితిని అర్థం చేసుకుని చర్యలు తీసుకోవాలి. గురుకులాలు, హాస్టళ్లపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి” అని డిమాండ్ చేశారు.మొంథా తుఫాను ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కేంద్రం తరపున ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపినట్లు తెలిపారు. “ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి” అని సూచించారు.

## అందుగుల వాగు నుండి అక్రమ ఇసుక రవాణాపై మాడుగుల పోలీసుల కఠిన చర్యలు



**మాడుగుల, అక్టోబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మాడుగుల పోలీస్ స్టేషన్ పరిధిలోని అందుగుల మరియు ఇర్విన్ గ్రామాలలో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు, చట్టం మరియు ప్రజా శాంతి భద్రతకు భంగం కలిగిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టారు. ఈ వారంలో మాడుగుల పోలీస్ స్టేషన్ అధికారులు, ఇసుక అక్రమ రవాణాలో పాల్గొన్నందుకు 24మంది నిందితులను గుర్తించి, తహసీల్దార్ మాడుగుల సమక్షంలో వారిని బైండ్‌ఓవర్ చేశారు.ఇసుక అక్రమ రవాణా, అలాగే శాంతి భద్రతకు భంగం కలిగించే చర్యలపై మాడుగుల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారని స్పష్టం చేశారు. ప్రజలు చట్టాన్ని గౌరవించి, అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని మాడుగుల సీఐ, ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

## సత్యనారాయణ పార్థివ దేహానికి ఘనంగా నివాళులర్పించిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మంగళవారం తెల్లవారు జామున పరమపదించారు. ఈ విషాద వార్త తెలిసిన వెంటనే ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు నివాసానికి చేరుకుని, సత్యనారాయణ పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయనతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి కూడా పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సత్యనారాయణ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు






**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. ఈ వారం రోజుల్లో రాచకొండలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ లు, ఎస్ఏ రైటింగ్ కాంపిటీషన్, షార్ట్ ఫిలిం కాంపిటీషన్, ఫోటోగ్రఫీ కాంపిటీషన్ నిర్వహించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం పోలీస్ శాఖ బాధ్యత” అని పేర్కొన్నారు.ఏసీపీ కేవీపీరాజు ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీలు ఈ ర్యాలీలలో పోలీసులతో పాటు ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారికి డయల్ -100, రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, పోక్సో చట్టం, మరియు సీసీ కెమెరాల ఉపయోగాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అక్టోబర్ 21 నుండి ఈనెల వరకు 31 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసులకి పది రోజులపాటు సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీరాజు, సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. అలాగే రోడ్డు భద్రత గురించి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయవద్దని, లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేని వాహనాలను నడపవద్దని సూచించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలను నడపకూడదని హెచ్చరించారు. ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు ప్రథమ చికిత్స అందించడం గురించి, అలాగే గ్రామాల్లో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. సైబర్ నేరాల గురించి ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఎవరైనా మోసాలకు గురైనప్పుడు వెంటనే 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు విద్యార్థులు ఉత్సావంతంగా పాల్గొని పోలీసులకు నివాళులు అర్పించారు.

## న్యాయవాది భాస్కర్‌కు రాష్ట్ర లీగల్ సేల్ బాధ్యతలు



**వనపర్తి,అక్టోబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కొండ భాస్కర్‌ను శ్రీ వాసవి సేవా సమితి తెలంగాణ రాష్ట్ర లీగల్ సేల్ అడ్వైజర్ కమిటీ కన్వీనర్‌గా నియమించారు. ఈ నియామక పత్రాన్ని జాతీయ లీగల్ ముఖ్య సలహాదారు రిటైర్డ్ జడ్జి, సుప్రీం కోర్టు న్యాయవాది నేరెళ్ల మాల్యాద్రి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పూరి సురేష్ శెట్టి, ఛైర్మన్ టీజీ వెంకటేష్, మాల్యాద్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ సలహాదారులు మల్యాల రాజ్‌కుమార్, గోవింద గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోషణ మాసం ముగింపు కార్యక్రమం



**సిద్దిపేట, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు.
జిల్లా కలెక్టర్ కే. హేమావతి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, బాలామృత వంటకాల స్టాళ్లను తిలకించి రుచి చూశారు. పౌష్టికాహారం, వ్యాయామం, యోగాతో ఆరోగ్యంగా ఎదగాలన్నారు. గర్భిణీ స్త్రీలు, బాలికలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. చైల్డ్ మ్యారేజ్ పై స్కిట్, ఊబకాయం పై డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు, ఉత్తమ అంగన్వాడీ సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## గురుకుల భోజనంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**సిద్దిపేట, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎన్సాన్పల్లి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.
విద్యార్థులు భోజనం చేస్తుండగా ఉపాధ్యాయులు మానిటరింగ్ చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. “విద్యార్థుల భోజనాన్ని పర్యవేక్షించకపోతే క్రమశిక్షణ ఎలా వస్తుంది?” అంటూ ప్రిన్సిపల్‌ను హెచ్చరించారు.విద్యార్థులందరూ తిన్న తర్వాతే టీచర్లు భోజనం చేయాలని సూచించారు. హాజరు ప్రకారం రైస్, కూరగాయలు సరైన కొలతలో ఇవ్వాలని, కామన్ డైట్ మెనూ పాటించాలని, రుచికరంగా వండాలని వంట సిబ్బందికి ఆదేశించారు.వసతి, చదువు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## ఆల్ ఇండియా ఆర్చరీలో చికితకు స్వర్ణం




**ఎలిగేడు, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండలంలోని సుల్తానాపూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించింది.
పంజాబ్ బటిండాలో జరిగిన కాంపౌండ్ మిక్స్‌డ్ టీం ఫైనల్లో చికిత ప్రథమేష్ జంట ట్రై బ్రేకర్‌లో విజయం సాధించి స్వర్ణం కైవసం చేసుకుంది. ఉమెన్స్ టీం ఈవెంట్‌లో చికిత కాంస్య పతకం కూడా గెలుచుకుంది.పలు పతకాలు సాధించిన చికితకు ఎలిగేడు మండల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.
“రాబోయే రోజుల్లో దేశానికి ఆర్చరీలో మంచి పేరు తీసుకురావాలి” అంటూ అభినందనలు తెలిపారు.

## ఆరుట్ల యువతీ ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్టు కోసం పోలీస్ స్టేషన్ ముందు ధర్నా



**మంచాల, అక్టోబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో పంబాల నందిని (20) అనే యువతీ తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన కలకలం రేపుతోంది. ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన మృతురాలి బంధువులు, నందిని ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మంచాల పోలీస్ స్టేషన్ ముందు రోడ్డుపై ధర్నాకు దిగారు.చట్టపరంగా తక్షణ చర్యలు తీసుకోవాలని మంచాల సీఐ మధుకు విజ్ఞప్తి చేశారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతూ కుటుంబ సభ్యులు, బంధువులు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

## నీట్‌లో అద్భుత విజయం సాధించిన శ్రావణిని అభినందించిన సంఘసేవకుడు రాము



**ఆమనగల్లు, అక్టోబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన ఈర్లపల్లి యాదయ్య, మహేశ్వరి దంపతుల కుమార్తె ఈర్లపల్లి శ్రావణి 2025 నీట్ పరీక్షలో అద్భుతమైన మార్కులు సాధించి గద్వాల ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు పొందింది. ఈ సందర్భంగా ఆమనగల్ పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు పాపిశెట్టి రాము శ్రావణిని ప్రత్యేకంగా అభినందించాడు.చిన్నతనం నుంచే ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన శ్రావణి, ఇంటర్మీడియట్‌ను ప్రభుత్వ గురుకుల గౌలిదొడ్డి కళాశాలలో పూర్తి చేసి, కృషి, పట్టుదల, అంకితభావంతో వైద్య విద్యలో అడుగుపెట్టిందని రాము పేర్కొన్నాడు. ఈ విజయం ఆమె కలల వైద్య ప్రయాణానికి నాంది అని, భవిష్యత్తులో కరుణతో, శ్రేష్ఠతతో సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించాడు.ఈ కార్యక్రమంలో పూసల భాస్కర్, శ్రీను, గజ్జె యాదయ్య, ఈర్లపల్లి శ్రీశైలం తదితరులు పాల్గొని శ్రావణికి అభినందనలు తెలిపారు.

## పేదింటి వధువుకు పుస్తె మట్టెలు అందజేత



**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వీణవంక మండలం బొంతుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద ఆర్య వైశ్య కుటుంబానికి చెందిన నవ్య వివాహం నవంబర్ 1న నిశ్చయించబడింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావడంతో వివాహానికి సహాయం కోరుతూ నవ్య కుటుంబ సభ్యులు కరీంనగర్ పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నగునూరి రాజేందర్‌ను సంప్రదించారు.కుటుంబ పరిస్థితులను తెలుసుకున్న రాజేందర్, దాతల సహకారంతో ఈరోజు వైశ్య భవన్‌లో పెళ్లికూతురికి బంధువుల సమక్షంలో చీర, పుస్తె, మట్టెలు అందజేశారు. గత పదిహేను సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇకముందు కూడా కొనసాగిస్తామని రాజేందర్ పేర్కొన్నాడు. సహాయం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలియజేశాడు.ఈ కార్యక్రమంలో పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది వేణుగోపాల్, కోశాధికారి సుద్దాల వెంకటేష్, ఉపాధ్యక్షులు బొడ్ల శ్రీరాములు, తిరుపతి, అలెంకి సంతోష్ రాజ్, సంతోష్, కిరణ్ కుమార్‌తో పాటు నవ్య బంధువులు పాల్గొన్నారు.

## కురిక్యాల ప్రధానోపాధ్యాయురాలు సస్పెన్షన్



**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గంగాధర మండలం కురిక్యాల జెడ్పీహెచ్ఎస్‌లో బాలికలపై లైంగిక వేధింపుల ఘటనను దాచిపెట్టిన కారణంగా ప్రధానోపాధ్యాయురాలు టీ. కమలను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ కమిటీ నివేదికలో ఆమె సిబ్బందిని బెదిరించారని, విద్యార్థుల భద్రతను విస్మరించారని పేర్కొంది. సబార్డినేట్ యాకూబ్ పాషా ఇప్పటికే సస్పెండ్ అయిన విషయం తెలిసిందే.

# పారదర్శక పాలనకే ప్రాధాన్యం

## అవినీతి నిర్మూలనపై కలెక్టర్ సంకల్పం





**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అవినీతి నిర్మూలన లక్ష్యంగా పారదర్శక పాలనను బలోపేతం చేయాలని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు చేరువై నిబద్ధతతో సేవలందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా కలెక్టర్ సత్యనిష్ఠ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఉద్యోగి సమగ్రత, నిజాయితీ, జవాబుదారీతనంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని, అవినీతికి తావు లేకుండా పారదర్శకతతో కూడిన పాలనను అందించాలన్నారు. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు 'కల్చర్ ఆఫ్ ఇంటెగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పరిటీ' అనే థీమ్‌తో నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిర్మూలనపై క్విజ్ పోటీలు, వాక్‌థాన్‌లు, మారథాన్‌లు, వీధినాటకాలు, గ్రామసభలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి ఉద్యోగి తన విధుల్లో నిజాయితీ, పారదర్శకత, సమగ్రతను అలవర్చుకోవాలని సూచించిన కలెక్టర్, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సేవలందించాలన్నారు. అవినీతిని అరికట్టడంలో పౌరుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశమని వివరించారు.అనంతరం కలెక్టర్ బాదావత్ సంతోష్ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. అమరేందర్, విజిలెన్స్ ఇన్స్పెక్టర్ ఏ. సురేందర్ రెడ్డి, కే. విజయ్ కుమార్ (ఏడి అగ్రికల్చర్), కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, రవాణా శాఖ ఇన్స్పెక్టర్ అవినాష్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ నగర్ దర్గా వద్ద ఘనంగా గార్వి షరీఫ్ కార్యక్రమం



**ఆల్విన్ కాలనీ,అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కామన్ ఎదురుగా ఉన్న దర్గా వద్ద మైనారిటీ సోదరుల ఆధ్వర్యంలో గార్వి షరీఫ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై, ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారుఈ సందర్భంగా మైనారిటీ సోదరులు సామూహికంగా ప్రార్థనలు నిర్వహించి, సామాజిక సమైక్యతకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మల్లేష్, పెద్ద ఖాజా, చిన్న ఖాజా, షౌకత్ అలీ మున్నా, రెహమాన్, శివ, మహేష్, బషీర్, ఖలీమ్, సాయి, సందీప్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ వాసుల సమక్షంలో శాంతియుత వాతావరణంలో కార్యక్రమం ముగిసింది.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: శంభీపూర్ కృష్ణ



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని శంభీపూర్ కార్యాలయంలో బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణను నియోజకవర్గానికి చెందిన ప్రజలు, కాలనీ సభ్యులు, నాయకులు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజల సమస్యలను వినిపించిన ఆయన, సానుకూలంగా స్పందిస్తూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని స్పష్టం చేశారుప్రజల సమస్యలను మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద దృష్టికి తీసుకెళ్లి, వారి సహాయ సహకారాలతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని శంభీపూర్ కృష్ణ తెలిపారు. ప్రజలతో నిత్యం సమీపంగా ఉండి, వారి అవసరాలకు స్పందించే నాయకత్వం అందించేందుకు తాను కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు.

## రేపు మహేశ్వరం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కార్యక్రమం




**మహేశ్వరం, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమరవీరుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మహేశ్వరం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 8 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. మండలంలోని గ్రామాల ప్రజలు, యువత ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ పిలుపునిచ్చారు.

## పట్టణాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్



**వనపర్తి,అక్టోబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వనపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో పార్టీ నాయకులు పట్టణ అభివృద్ధిపై మాట్లాడారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, వనపర్తి పట్టణానికి కాంగ్రెస్ ప్రభుత్వం 18 కోట్ల 70 లక్షల రూపాయల అభివృద్ధి పనులు సాంక్షన్ చేయించినట్లు తెలిపారు. గతంలో ఎమ్మెల్యే పదవిలోకి వచ్చిన వెంటనే మేఘా రెడ్డి50 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారని పేర్కొన్నారు.సమన్వయకర్త లక్కాకుల సతీష్ మాట్లాడుతూ, బీజేపీ నాయకులు అర్థంలేని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకురావాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు బి.కృష్ణ, పి.కృష్ణ మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధి కొనసాగాలంటే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి పట్టణ అభివృద్ధిపై నిరంతరం శ్రద్ధ చూపిస్తున్నారని, ప్రతి వార్డును సమన్వయపరుస్తూ పనులు చేపడుతున్నారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చందర్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బొందలపల్లిలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్

500 మందికి పైగా వైద్య సేవలు



**నాగర్ కర్నూల్,అక్టోబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నాగర్‌కర్నూల్ మండలం బొందలపల్లి గ్రామంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బండారు ఆనంద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం ఏర్పాటు కాగా, హైదరాబాద్ ఆరోగ్య మరియు యశోదా హాస్పిటల్ వైద్య బృందం గ్రామస్తులకు న్యూరో, గుండె సంబంధిత వ్యాధులు, గైనిక్, జనరల్ ఫిజీషియన్ పరీక్షలు నిర్వహించారు. అలాగే బీపీ, షుగర్ తదితర పరీక్షలు కూడా ఉచితంగా అందించారు.వైద్య పరీక్షల అనంతరం అవసరమైన మందులను గ్రామస్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ హెల్త్ క్యాంప్‌లో సుమారు 500 మందికి పైగా గ్రామస్తులు పాల్గొని వైద్య సేవలను పొందారు. గ్రామ ప్రజలు ఈ శిబిరాన్ని ఎంతో అభినందించారు.కార్యక్రమం ముగిసిన అనంతరం ఆరోగ్య, యశోదా హాస్పిటల్ వైద్య బృందాన్ని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దారు.

# ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ రహదారి అవసరం

**సెల్ టవర్ నిర్మాణంపై విమానపురి కాలనీవాసుల ఆందోళన**



**చింతల్,అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని చింతల్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతున్న నేపథ్యంలో, పాత గ్రీన్ హోటల్ భవనం నుండి ఎల్లమ్మ గుడి, సహారా హోటల్ మీదుగా అంబేద్కర్ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారి నిత్యం ట్రాఫిక్ జాంలో చిక్కుకుంటోంది. ఈ మార్గంలో రోజూ సుమారు రెండు లక్షల మంది ప్రయాణిస్తుండగా, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అత్యవసర సేవలైన అంబులెన్స్‌లు కూడా ఈ మార్గంలో సకాలంలో చేరలేని పరిస్థితి నెలకొన్నదని మాజీ డిసిసి అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రతాప్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణం అత్యవసరమని అభిప్రాయపడిన ప్రతాప్, కుత్బుల్లాపూర్ సర్కిల్ 25 డిప్యూటీ కమిషనర్‌ను మున్సిపల్ కార్యాలయంలో కలిసి, యుద్ధ ప్రాతిపదికన రహదారి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో విమానపురి కాలనీలో సెల్ టవర్ నిర్మాణంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఆరోగ్యాలపై ప్రభావం పడుతుందని పేర్కొంటూ, టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరారు. ఈ విషయాన్ని ప్రతాప్ దృష్టికి తీసుకెళ్లిన కాలనీవాసులు, టవర్ నిర్మాణం జరుగుతున్న భవనానికి ఫైర్ ఎన్.ఓ.సి., అక్యూపెన్సీ వంటి అనుమతులు లేవని తెలిపారు. ప్రజల అంగీకారం లేకుండా సెల్ టవర్ నిర్మాణం కొనసాగడం సరికాదని, వెంటనే తొలగించాలని ప్రతాప్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో విమానపురి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రోడ్లపై ఆక్రమణలకు చెక్





**- ఎన్.హెచ్ 765 సహా ప్రధాన రహదారులపై మునిసిపల్ చర్యలు**

**-పోలీసుల సహకారంతో ఆక్రమణల తొలగింపు**



**ఆమనగల్లు, అక్టోబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):** పట్టణంలోని జాతీయ రహదారి (ఎన్.హెచ్ -765)తో పాటు ప్రధాన రహదారులపై ఏర్పడిన ఆక్రమణలపై మునిసిపల్ అధికారులు కఠినంగా వ్యవహరించారు. వ్యాపారులు, యజమానులు నిర్మించుకున్న షెడ్లను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ముందుగా సూచనలు ఇచ్చినప్పటికీ, స్పందన లేకపోవడంతో మునిసిపల్ సిబ్బంది పోలీసుల సహకారంతో ఆక్రమణలను తొలగించారు పౌరుల రవాణా సౌకర్యార్థం రహదారులు శుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్టు మునిసిపల్ కమిషనర్ శంకర్ తెలిపారు. రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తే మునిసిపల్ చట్టం -2019 ప్రకారం భారీ జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే రహదారులపై ఆటోలు నిలిపే డ్రైవర్లు ప్రత్యామ్నాయ స్థలాలను వినియోగించుకోవాలని సూచించారు. రవాణా అడ్డంకులను తొలగించడంలో ప్రజల సహకారం కీలకమని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ జానకిరాం రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వరప్రసాద్, మేనేజర్ ఆంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సిబ్బంది రామకృష్ణ, చిట్టీబాబు, మహబూబ్, సుధాకర్, సురేశ్, రవి, నర్సింహా, ప్రశాంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సృష్టి సారథి



కొండలలో కొలువై నిలిచేటి ఓ కొంగు
బంగారు దేవుడా, రాయుడా!
కొన్ని రాతలు కొలిసి రాస్తావా రాయుడా?

నీ కొలువులో కోటి మంది భక్తులు,
తానాలు, మొక్కులతో తలములకలవుతుంటారు
పాసిస్టులు, నాసిస్టులు, నాస్తికులు సైతం
నిన్నే నమ్ముతున్నారు ఈ యుగంలో.

ప్రతి ఒక్కడూ ఏదో ఒక మతంలో
నిన్నే పూజిస్తున్నాడు, నిన్నే కొలుస్తున్నారు.
చెట్టులో నీవే, పుట్టలో నీవే అని
ఎంతో ఆరాధిస్తున్నారు.

మతాన్ని ఆచరించని మనిషి లేడు,
భగవంతుని మొక్కని బహులు లేరు
అందరూ నీకే దారితీస్తున్నారు.

అయితే నీ సృష్టిలో ఎందుకీ వక్రబుద్ధులు?
నీవే సృష్టించిన మనిషి ఎందుకీ హింసతో నిండిపోయాడు?
సృష్టించువాడవు నీవే, నడిపించువాడవు నీవే,
మధ్యలోనే మరణం ఎందుకు ఇస్తావు, ఓ సృష్టి సారథీ?

సురపానాలు స్వర్గానికి అందించావు,
మానవులకు మాత్రం మద్యమనే శాపం!
మనసులు బానిసలు అవుతున్నాయి నీ సృష్టిలోనే
ఇది నీ లీలా? లేక మా పాపమా?

నీ పాదాల చెంత పడి మనసు అడుగుతోంది
"వక్రబుద్ధిని అరికట్టు, సన్మార్గం సృష్టించు,
సృష్టిని సక్రమంగా నడిపించు
మనవుని మనిషిగా నిలిపించు!"

దేవునితో వాదన, మానవతతో మననం
-'సృష్టి సారథి' ఒక ఆత్మపరిశీలన కవిత

-------------------------------

మీ

గంగవరం రామకృష్ణారెడ్డి
ప్రధానోపాధ్యాయులు తపస్విని స్కూల్, వనపర్తి



# కడ్తాల్ తహసీల్దార్ కు సన్మానం



**కడ్తాల్, అక్టోబర్ 28 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** కడ్తాల్ మండల నూతన తహసీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన జయశ్రీ ని జిల్లా ఎంపీటీసీల సంఘం మాజీ కార్యదర్శి, రావిచేడ్ మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్ మంగళవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తహసీల్దార్‌ను కోరారు.. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షుడు వీరయ్య, మాజీ సర్పంచ్ భాగమ్మ జంగయ్య, నాయకులు పవన్ కుమార్, సాయికుమార్, కృష్ణయ్య, శ్రీశైలం, శంకర్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శ



**కడ్తాల్, అక్టోబర్ 28 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామానికి చెందిన బందరి బాలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు లింగం, జమీర్, పవన్ కుమార్, యాదగిరి, రవి, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు..

# జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఆహ్వానం

**పెద్దపల్లి ఐటీఐ మైదానంలో అక్టోబర్ 31 నుంచి పోటీలు**



**ఎలిగేడు, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లా మై భారత్, యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 31 నుంచి నవంబర్ 1 వరకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. పెద్దపల్లి ఐటీఐ కళాశాల మైదానంలో జరిగే ఈ టోర్నమెంట్‌లో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, షార్ట్ పుట్, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించనున్నారు. 15 -29 ఏళ్ల వయస్సు గల పురుషులు, మహిళలు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా యువజన అధికారి వెంకట్ రాంబాబు కోరారు. వివరాలకు రేషవేణి మహేష్ (7993604489), రాకేష్ (7780674425 ు వాలీబాల్), వేగోళం రిషి (9390559514 ు కబడ్డీ), కర్ణాకర్ రెడ్డి (9908133143) ను సంప్రదించవచ్చు అన్నారు.

# ఇన్సూరెన్స్ కంపెనీకి జిల్లా ఫోరం అక్షింతలు

**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తీగలగుట్టపల్లికి చెందిన మురళి కృష్ణ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో రూ.50 లక్షల పాలసీ తీసుకుని 2022 వరకు ప్రీమియం చెల్లించారు. హార్ట్ ప్రాబ్లంతో మృతి చెందగా, నామినీ వెంకట లక్ష్మి క్లెయిమ్ కోరగా కంపెనీ నిరాకరించింది. లీగల్ నోటీసులు పంపినా స్పందన లేకపోవడంతో జిల్లా కన్స్యూమర్ కోర్టులో కేసు వేశారు. విచారణ అనంతరం కోర్టు కంపెనీ 30 రోజుల్లో రూ.50 లక్షలు చెల్లించాలని తీర్పునిచ్చింది.

# మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు కి పితృవియోగం

**పరామర్శించి నివాళులు అర్పించిన, మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.**



**దేవరకొండ అక్టోబర్ 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ప్రధాన నేత తన్నీరు హరీష్ రావు తండ్రి అయిన తన్నీరు సత్యనారాయణ మంగళవారం ఉదయాన్నే స్వర్గస్తులైనారు.. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హైదరాబాదులోని వారి స్వగృహంనకు వెళ్లి సత్యనారాయణ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి వారి మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు అవగాహన





**కడ్తాల్, అక్టోబర్ 28 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయబడిన ఔషధ మొక్కల తోట,కూరగాయల తోట, ఇంకుడు గుంత, కంపోస్ట్ పిట్ వంటి కార్యక్రమాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగయ్య ఆధ్వర్యంలో నాబార్డ్ సంస్థ రంగారెడ్డి జిల్లా డిడిఎం హరీష్ రఘురాం , సిజిఆర్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జేస్సర్ అన్నమయ్య ,ఔషధ తోట సలహాదారులు మహమ్మద్ రఫీ యొద్దిన్, మండల విద్యాశాఖ అధికారిని నిర్మల గ సందర్శించడం జరిగింది. అనంతరం పాఠశాలలో పండించిన సేంద్రీయ కూరగాయలను జ్ఞాపికగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి , ఎర్త్ లీడర్స్ షష్మంత్, రాఘవేందర్, ముజాహిద్, ప్రసాద్,ఆదిత్య, నవదీప్,ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు,యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ రజనీకాంత్, ప్రోగ్రాం ఆఫీసర్ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## తారామతి పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఔషధ మొక్కలు, కూరగాయల మొక్కల పెంపకంలో విద్యార్థులకు శిక్షణ





**అబ్దుల్లాపూర్మెట్,అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ మరియు పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంలో భాగంగా రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్ మండలం లోని పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తారమతి పేట్ లో ఏర్పాటు చేయబడిన ఔషధ మొక్కల తోట, కూరగాయల తోట, ఇంకుడు గుంత, కంపోస్ట్ పిట్ వంటి కార్యక్రమాలను పాఠశాల ఇన్చార్జి హెడ్ మాస్టర్ ఎం.ఎర్రయ్య ఆధ్వర్యంలో నాబార్డ్ సంస్థ రంగారెడ్డి జిల్లా డిడిఎం హరీష్ రఘురాం, సిజిఆర్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జెఎస్ ఆర్ అన్నమయ్య, ఔషధ తోట సలహాదారులు మహమ్మద్ రఫీ యొద్దిన్, సందర్శించడం జరిగింది. అనంతరం పాఠశాల ఆవరణంలో సేంద్రీయ పద్ధతిలో పండించిన కూరగాయలను కొయ్యడం, విద్యార్థులకు ఔషధ మొక్కల ప్రాధాన్యత, పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెంటర్ టీచర్ రమేష్ రావు, ఎర్త్ లీడర్స్ సాత్విక, జెన్సికా, ధ్రువన్, ద్విజేష్, చందు, చరణ్ ఉపాధ్యాయులు మహిపాల్ కరంటోత్, డా.పరశురాం, జ్యోతి, వెంకట్ రాం రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

- మోతిలాల్ నాయక్




**వెల్దండ, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమాన్ని లక్ష్యంగా తీసుకున్నాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ తెలిపారు. కల్వకుర్తిలో విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయడం, ఉచిత కరెంటు, సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు.గత బిఆర్ఎస్ హయాంలో రైతుబంధు పేరిట వేల కోట్ల రూపాయలు బడా బాబులకు కట్టబెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ పథకాలు ఇంటింటికీ చేరుతున్నాయని, బడుగు బలహీన వర్గాల అభివృద్ధే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# నీలగిరి ఎక్స్ ప్రెస్ దినపత్రిక చొరవతో పారిశుధ్య పనుల నిర్వహణ

**హుస్నాబాద్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భీమదేవరపల్లి మండలం అమనాకుర్తి గ్రామంలోని బస్టాండ్ పక్కన మోరి ఉండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి, స్థానికులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. దుర్వాసన, చెత్త చెదారం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గుర్తించిన నీలగిరి ఎక్స్‌ప్రెస్ ప్రతినిధులు ఈ విషయాన్ని తక్షణమే గ్రామపంచాయతీ కార్యదర్శికి తెలియజేశారు. సమాచారం అందుకున్న కార్యదర్శి, వెంటనే సిబ్బందిని రంగంలోకి దింపి మోరిని శుభ్రపరచడంతో పాటు, చెత్త ప్రాంతాల్లో బీజింగ్ పౌడర్ చల్లించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే చర్యలు చేపట్టారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్పందించిన గ్రామపంచాయతీ చర్యలను హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ కె. రాకేష్ అభినందించారు.







# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో ప్రజలకు లాభం లేదు - కవిత

## షాద్‌నగర్‌లో జాగృతి అధ్యక్షురాలు కవితకు ఘన స్వాగతం పలికిన కప్పాటి

**షాద్‌నగర్, అక్టోబర్ 28:**
తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వల్ల ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. 'జాగృతి జనంబాట' కార్యక్రమంలో పాల్గొనేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉద్దండాపూర్ రిజర్వాయర్ సందర్శించడానికి వెళ్తున్న సందర్భంగా బెంగుళూరు - హైదరాబాద్ జాతీయ రహదారి వద్ద షాద్‌నగర్‌లో ఆమెకు ఘన స్వాగతం పలికారు.రంగారెడ్డి జిల్లా జాగృతి నియోజకవర్గ ఇంచార్జ్ చీమల రమేశ్ కురుమ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కప్పటి పాండురంగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోళ శ్రీనివాస్, మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తఫా తదితరులు పాల్గొని మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ



సందర్భంగా విలేఖర్లతో మాట్లాడిన కవిత ు ఉప ఎన్నికల గెలుపు, ఓటముల వల్ల ప్రజలకు ప్రయోజనం లేదని వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడమే ఈ యాత్ర లక్ష్యమని తెలిపారుకాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని ఆమె విమర్శించారు. ఉచిత బస్సులు తప్ప, పింఛన్లు, ఇండ్లు వంటి ముఖ్యమైన హామీల విషయంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు తన పర్యటనలు కొనసాగుతాయని తెలిపారు.పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని నిలదీయడానికి తమ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి రాం కోటీ, రాష్ట్ర యంబీసీ అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ, అందుగుల సత్యనారాయణ, ఉదయ బాను, షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడు మహేష్, కేశంపేట్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, కొత్తూరు మండల అధ్యక్షుడు వీరయ్య, చౌదర్‌పల్లి మండల అధ్యక్షుడు అంజీ కురమ, పరూక్‌నగర్ మండల అధ్యక్షుడు మల్లేశ్, నరేందర్, గోపు వర్ష, జాగృతి శ్రేణులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి

-తుఫాన్ నేపథ్యంలో వేగవంతమైన చర్యలు తీసుకోండి
- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సూచన

**హైదరాబాద్, అక్టోబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులు ఇబ్బంది పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధికారులను ఆదేశించారు. మొంథా తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న సిబ్బంది వేగవంతంగా స్పందించాలని సూచించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా తూకం వేయాలని, తూకం పూర్తయిన వెంటనే రైస్ మిల్లులకు తరలించే బాధ్యత అక్కడి అధికారులదేనని స్పష్టం చేశారు.ధాన్యం లారీలకు ఎక్కిన తర్వాత రైస్ మిల్లులకు చేరే వరకు రైతులకు బాధ్యత పెట్టొద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద తూకం



పూర్తయిన వెంటనే ధాన్యాన్ని తరలించే బాధ్యత కేంద్రాల్లో ఉన్న సిబ్బంది తీసుకోవాలని ఆయన అన్నారు. రైతులకు ఒత్తిడి లేకుండా వ్యవస్థను నడిపించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణ, ఏర్పాట్లు, ఇతర సదుపాయాలపై పౌరసరఫరాల శాఖ ప్రొక్యూర్మెంట్ జీఎం నాగేశ్వర్ రావుతో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి సమావేశమయ్యారు. ఖరీఫ్ ధాన్యం సేకరణకు 8,342 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, అందులో 4,428 కేంద్రాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయని, మిగిలిన 3,814 కేంద్రాల ప్రారంభానికి కసరత్తు జరుగుతోందని జీఎం వివరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులు కూడా ఏర్పాటు చేసిన విషయాన్ని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో కమిషన్ మెంబర్ సెక్రటరీ గోపాల్, అధికారులు సంధ్య రాణి, హరి వెంకట ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జవహర్‌నగర్ పోస్టాఫీస్ తరలింపు రద్దు చేయాలి: సర్దార్ రవీందర్ సింగ్

**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జవహర్‌నగర్ సబ్ పోస్టాఫీస్‌ను కొణారావుపేట మండలానికి తరలించే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ మేయర్, మాజీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ డిమాండ్ చేశారు.55 ఏళ్లుగా విశ్వసనీయ సేవలందిస్తున్న ఈ శాఖపై వేలాది మంది సీనియర్ సిటిజన్లు, ఉద్యోగ విరమితులు, మహిళా డిపాజిటర్లు ఆధారపడి ఉన్నారని తెలిపారు. "తరలింపు వల్ల వృద్ధులకు తీవ్ర అసౌకర్యం తలెత్తుతుంది" అని



పేర్కొన్నారు.స్మార్ట్ సిటీ విస్తరణ నేపథ్యంలో కొత్త పోస్టాఫీసులు ఏర్పాటు చేయడం సమంజసం కానీ, పాత శాఖను తొలగించడం ప్రజా హితానికి విరుద్ధమన్నారు.కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తక్షణ జోక్యం చేసి ప్రతిపాదనను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. "జవహర్‌నగర్ పోస్టాఫీస్‌ను శతవాహన యూనివర్సిటీ, విద్యానగర్, రెకుర్తి లేదా తేళగలగుట్టపల్లి ప్రాంతాల్లో కొనసాగించాలి" అని సూచించారు.

# జూబ్లీహిల్స్ ప్రచారంలో పాల్గొన్న మల్లురవి, ఎమ్మెల్యేలు



**హైదరాబాద్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం పార్టీ నేతలు గడపగడపకీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. బోరబండ డివిజన్‌లో జరిగిన ప్రచార కార్యక్రమంలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం బిఆర్ఎస్ అధీనంలో ఉండి ప్రజలను గాలికి వదిలేసిందని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే బోరబండ డివిజన్‌లో రూ.200 కోట్ల నిధులతో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చేయబడిందని మల్లురవి తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి అభివృద్ధి అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్క, ఇంచార్జ్ ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, యశస్విని రెడ్డి, మందుల సామెల్, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో జవహర్ నగర్ లో బి ఆర్ ఎస్ బిజెపి కార్యకర్తలు భారీగా చేరిక...



**వెంగళరావు నగర్, అక్టోబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ జవహర్ నగర్‌లో బిఆర్ఎస్ మరియు బీజేపీ పార్టీలకి చెందిన ముఖ్య నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. నవీన్ యాదవ్ వారికి పార్టీ కండువా కప్పి ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడిన నవీన్ యాదవ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోరుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా పాలనలో మార్పు తేవగల సామర్థ్యం ఉన్న పార్టీ ఒక్క కాంగ్రెస్ మాత్రమే. పేదల సంక్షేమం, యువతకు ఉపాధి, మహిళల భద్రత, వృద్ధులకు గౌరవం, ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సాధ్యమవుతాయి. నేను గెలిచిన తర్వాత ప్రతి ఒక్కరికి సమాన అభివృద్ధి అందించేలా కృషి చేస్తాను” అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల నమ్మకాన్ని గెలుచుకుంటూ ఇంటింటికీ చేరుతుండగా, ఇతర పార్టీల నాయకులు కూడా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై చేరడం ఆనందకరమని ఆయన పేర్కొన్నారు. ఈ చేరికలతో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరిందని, ప్రజల ఆశీర్వాదంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, యువ కార్యకర్తలు, మహిళా నాయకులు, మరియు స్థానిక ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# నేడు అమ్రాబాద్, పదర మండలాల్లో విద్యుత్ అంతరాయం

**అమ్రాబాద్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్రాబాద్ మండల కేంద్రంలోని 33kv ఫీడర్‌లో ట్రీ కట్టింగ్ పనుల కారణంగా నేడు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. అమ్రాబాద్, పదర మండల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# తన్నీరు సత్యనారాయణ రావు అస్తమయం...

**నివాళులర్పించిన జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీత గోపీనాథ్ ...**



**జూబ్లీహిల్స్,అక్టోబర్ 28(నీలగిరి, ఎక్స్ ప్రెస్)**
మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు మరణవార్త తెలిసి, వారి నివాసంలో పార్థివదేహానికి జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి మాగంటి సునీత గోపినాథ్ పుష్పాంజలి ఘటించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# యువత గంజాయికి బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలి

**-చారకొండలో ప్రజానాట్యమండలి కళాజాత**
**- మత్తు పదార్థాలపై అవగాహన**



**చారకొండ, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
“ఎంజాయ్” పేరుతో యువత గంజాయికి బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ పిలుపునిచ్చారు. చారకొండ మండల కేంద్రంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రజానాట్యమండలి కళాజాత బస్సు మంగళవారం చేరుకుంది. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలపై కళాజాత బృందం ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలు నిర్వహించింది.ఈ సందర్భంగా పల్లె నరసింహ మాట్లాడుతూ ు పట్టణాల్లోనే కాదు, గ్రామాల్లో కూడా యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతూ తమ ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారని, తల్లిదండ్రులకు కన్నీటి గాయాలు మిగిలిస్తూ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత చదువులో ముందుకు సాగి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.అనంతరం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ కొలహా మండలి సభ్యులుగా ఎన్నికైన పల్లె నరసింహను సిపిఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ డాక్టర్ చిలువేరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బలరాం గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి ఏ సారపు అశోక్ గౌడ్, డాక్టర్ చిలువేరు సత్యం, భూత్పూర్ శంకరయ్య, జెసిబి వెంకటయ్య గౌడ్, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు గోరేటి శివ, లక్ష్మయ్య గౌడ్, గుండె శివ గౌడ్, చింతపల్లి అశోక్ గౌడ్, పసుల శీను, వెంకట్ రెడ్డి, గజ్జ కొండలు గౌడ్, కళాజాత బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హలో విద్యార్థి చలో కలెక్టరేట్

**బిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఈ నెల 29న కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలి.**
**బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ .**



**దేవరకొండ అక్టోబర్ 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
బిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఈ నెల 29న “హలో విద్యార్థి చలో కలెక్టరేట్” ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలి అని బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ కోరారు. మంగళవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ,పెండింగ్ లో ఉన్న ఫీజు రియాంబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్” ముట్టడి నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఒక వైపు గురుకుల పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తు మరో వైపు ఎస్ సి, ఎస్టి, బీసీ పేద విద్యార్థులకు ఫీజు రియాంబర్స్ మెంట్ ఇయ్యాక దాదాపు 23 నెలలు డిగ్రీ పూర్తి అయినా విద్యార్థులు పై చదులకు పోవడానికి టిసి లు ఇయ్యకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుంది అని ఆయన తెలిపారు.23 నెలలు నుంచి విద్యాశాఖకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం వల్ల అనేక సమస్యలు విద్యారంగంలో ఉన్నాయి అని ఆయన తెలిపారు.విద్యార్థులకు ఫీజురీయింబర్స్మెంట్ రాకపోవడం వల్ల, పై చదువులకు వెళ్ళడానికి విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు అని ఆయన చెప్పారు.విదేశీ విద్యను అభ్యసిస్తునటువంటి అంబేద్కర్ స్కాలర్ షిప్ ఎస్ సి, ఎస్టి,బిసి జ్యోతిరావు పూలే స్కాలర్ షిప్, మైనారిటీ విద్యార్థులకి గత మూడు సంవత్సరల నుండి పెండింగ్ లో ఉన్నటువంటి 350 కోట్ల రూపాయలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ పనులు చేసిన తమ మంత్రులకు బిల్లులు క్లియర్ చెసింది కానీ విద్యాసంస్థ యాజమాన్యం లకు మాత్రం ఫీజురీయింబర్స్మెంట్ బిల్లులు క్లియర్ చేయలేకపోయారు అని ఆయన ఆరోపించారు.పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు ప్రభుత్వం విడుదల చేసె వరకు బిఆర్ఎస్వీ తరుపున పోరాటం ఆగదు అని ఆయన అన్నారు. తక్షణమే పెండింగ్ లో ఉన్న 8150కోట్ల ఫీజు రియాంబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# స్కాలర్‌షిప్‌ల ఆలస్యం ప్రభుత్వం నిర్లక్ష్యం ఎందుకు?

**ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ ఎదుట ధర్నా**



**కల్వకుర్తి, అక్టోబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు ప్రభుత్వ బిక్షలు కాదని, విద్యార్థుల హక్కులని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు తెలిపారు. కల్వకుర్తి కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు తాటికొండ ప్రశాంత్ యాదవ్ మాట్లాడుతూ..విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు విద్యారంగంపై సవతితల్లి ప్రేమ చూపిస్తోంది అన్నారు.గత బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7 శాతం నిధులే కేటాయించి, వాటినీ పూర్తిగా విడుదల చేయకపోవడం దారుణం. చిన్న రాష్ట్రాలైన ఈశాన్య రాష్ట్రాల్లో 12-13 శాతం బడ్జెట్ విద్యారంగానికి కేటాయిస్తుంటే, తెలంగాణలో మాత్రం అరకొర నిధులతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు అని విమర్శించారు.రాష్ట్రంలోని 90 శాతం మంది విద్యార్థులు ఎస్సీ ఎస్టీ బీసీ మరియు ఇతర బలహీన వర్గాలకు చెందినవారు. వీరిలో చాలా మంది స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారు. కానీ ప్రభుత్వం సుమారు రూ. 8600 కోట్ల రూపాయలను పెండింగ్‌లో ఉంచి పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తోంది. అనేక ప్రైవేటు విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందులతో బంద్‌లు, ఆత్మహత్యల దిశగా వెళు_న్నాయి” అని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా, విద్యార్థుల వద్ద నుంచి యాజమాన్యాలు ఫీజులు వసూలు చేస్తున్నాయని, ఫీజులు చెల్లించలేక చాలామంది విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని, చదువు పూర్తి చేసిన వారు కూడా సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు.
రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరూ విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై స్పందించాలన్నారు.ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి అక్కి వంశీ గౌడ్, సంయుక్త కార్యదర్శి హరికృష్ణ, శివరాం, శ్రీకాంత్ మోహన్, కార్యకర్తలు మరియు అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# నేతకాని కులానికి స్మశాన వాటిక స్థలం కేటాయించాలి



**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలోని ఎస్సీ నేతకాని కుల ప్రజలకు స్మశాన వాటిక కోసం ప్రభుత్వ స్థలం కేటాయించి పట్టా మంజూరు చేయాలని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం మారుతి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు. గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో పూర్వకాలం నుంచి దహన సంస్కారాలు నిర్వహిస్తూ 65 సమాధులు నిర్మించారని తెలిపారు. దీపావళి సందర్భంగా పూర్వీకులకు పూజలు చేసే సంప్రదాయం కొనసాగుతోందని వివరించారు. ఇటీవల కొంతమంది గోరీలను తొలగించేందుకు ప్రయత్నించడంతో, వాటిని రక్షించేందుకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.100 కుటుంబాలు నివసిస్తున్న నేతకాని కుల ప్రజలకు రాజ్యాంగ హక్కుల పరిరక్షణగా స్మశాన వాటిక స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు B. లక్ష్మీరాజము, బండారి శంకరయ్య, జాడి కొమురయ్య, జి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యులకు గుర్తింపు ఇవ్వాలి

**ప్రజా భవన్‌లో వినతిపత్రం అందజేసిన ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు**




**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులపై టీజీఎంసీ సభ్యులు దాడులు చేయడాన్ని ఆపాలని, శిక్షణలు ఇచ్చి ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని కోరుతూ ప్రథమ చికిత్స వైద్యుల సంఘం నేతలు ప్రజా భవన్‌లో వినతిపత్రం అందజేశారు.రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేసిన మంద వేణుగోపాల్ గౌడ్, కొమ్ము గణేష్‌లు ు గ్రామీణ వైద్యుల సేవలు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని వివరించారు. చిన్నారెడ్డి స్పందించి ఆరోగ్య శాఖ అధికారులకు ఎండార్స్ చేసినట్లు తెలిపారు.

## నవంబర్ 2న నల్లగొండలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ (టిజి ఎస్ సిడిడి ఎంఎస్ ఏ) కార్యవర్గ సమావేశం....

**నల్లగొండ, అక్టోబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):** షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నవంబర్ 2 వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నల్లగొండలోని టీఎన్జీవో భవన్ లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరగనున్నది. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ లకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హోదా, జూనియర్ అసిస్టెంట్ కం టైపిస్టులను జూనియర్ అసిస్టెంట్లుగా మార్చే ప్రతిపాదన, 317 జీవో తదితర అంశాలపై చర్చ జరగనున్నది. టీజీ ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ అధ్యక్షతన జరగనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి, కోశాధికారి, ఉమెన్స్ వింగ్ అధ్యక్షురాలు, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గం, సలహాదారులు, ఉమ్మడి జిల్లా మినిస్టీరియల్ గౌరవ స్టాప్ సభ్యులు టీఎన్జీవో నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరియు నేతలు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మరియు నేతలు హాజరుకానున్నారు. ఇట్టి సమావేశానికి గౌరవ సభ్యులు తప్పక హాజరు కావాలని టీజీ ఎస్ సి డి డి ఎంఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మరియు టీఎన్జీవో నల్గొండ జిల్లా శాఖ ఉపాధ్యక్షులు జి.జైపాల్ ఒక ప్రకటనలో కోరారు.

## ఆటో డ్రైవర్ల గురించి కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదం

-ఆనాడు విమానాల్లో విహరించి..
ఈనాడు ఆటోల్లో తిరుగుతున్న కేటీఆర్
-టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**హైదరాబాద్, అక్టోబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)** బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు ఆకాశంలో విమానాల్లో విహరించిన ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఇవాళ అధికారం పోగానే ఆటోల్లో తిరగడం, ఆటో డ్రైవర్ల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా రహమత్ నగర్ న్యూటన్ పబ్లిక్ స్కూల్ ప్రాంతంలోని వాడవాడలా ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆనాడు ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిందన్నారు. ఇందులో భాగంగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించి, విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. పేద మహిళలకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారిందని, ప్రభుత్వానికి మంచిపేరు వస్తున్నదన్నారు. అదేవిధంగా బడుగు,బలహీన వర్గాల పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు తదితర అనేక సంక్షేమ పథకాలను సక్సెస్ ఫుల్ గా అమలు చేస్తుంటే, చూసి ఓర్వలేని ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని బండి సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు. సంక్షేమం అంటేనే కాంగ్రెస్ పార్టీ... కాంగ్రెస్ పార్టీ అంటే విలువల కోసం, ఇచ్చిన మాట కోసం పనిచేసే ప్రభుత్వం అని ప్రతిపక్షాలు గుర్తెరిగి మాట్లాడాలని ఆయన హితవు పలికారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను ధ్వంసం చేసి, దండుపాళ్యం బ్యాచ్ లాగా దోచుకొని, దాచుకున్న ఘనత కేటీఆర్ కుటుంబానిదేనన్నారు. ప్రజల బాగు కోసం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓట్లు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత ఈ నియోజకవర్గ ప్రజలపైనే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీపై, ప్రభుత్వంపై అవాకులు, చెవాకులు పేలుతున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు ప్రజలు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని బండి సుధాకర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ ఇంటింటి ప్రచారంలో ఆయన వెంట ప్రముఖ సంఘ సేవకులు పీటర్ పాల్, మౌనిక, శ్యాం, బండి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్వో కార్యాలయంలో లంచం లేకపోతే పనుల్లేవన్న ఆరోపణలు



**మహేశ్వరం, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం మండల కేంద్రంలో ఉన్న ఎమ్మార్వో కార్యాలయంలో లంచం ఇవ్వకుండా ప్రజలకు సేవలు అందడం లేదని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎర్ర నవీన్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. అటెండర్ నుంచి డిప్యూటీ తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్ వరకు అందరూ లంచం తీసుకుంటున్నారని, నిరుపేదులు పనుల కోసం వెళ్లినప్పుడు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డు వంటి అవసరమైన సేవల కోసం 1000 నుంచి 4000 వరకు లంచం డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. అలాగే, ఉప తహసీల్దార్ మరియు కంప్యూటర్ ఆపరేటర్ అసభ్యంగా మాట్లాడుతున్నారని, ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు కూడా అశ్రద్ధగా, అవమానకరంగా స్పందిస్తున్నారని ఎర్ర నవీన్ కుమార్ తెలిపారు. ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయనతో పాటు అమీర్పేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు నీగోల బాలరాజ్ డిమాండ్ చేశారు.

## హుస్నాబాద్ ఆసుపత్రికి ఆధునిక పరికరాలు



**హుస్నాబాద్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిఎస్ఆర్ నిధుల కింద హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునిక వైద్య పరికరాలు మంజూరయ్యాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో రూ.1.5 కోట్లు విలువైన పరికరాలు అందించారని బీజేపీ నాయకులు తెలిపారు. ఈసీజీ, అల్ట్రాసౌండ్, అనస్థీషియా వర్క్‌స్టేషన్, ఫెటల్ మానిటర్, జనరల్ సర్జరీ, ఎమర్జెన్సీ రికవరీ పరికరాలు వారం రోజుల్లో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల, పట్టణ నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు - కలెక్టర్




**మంచిర్యాల, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లో జరిగిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ట్రాఫిక్, మున్సిపల్, రవాణా, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నవంబర్ 1-7 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్లపై చెత్త, ఆటంకాలు తొలగించాలని, అనధికార వాహన నిలుపుదలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాద ప్రాంతాల్లో లైటింగ్, రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఓవర్ లోడెడ్ వాహనాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్రమ నిర్మాణాలు, వ్యాపార కార్యకలాపాలు తొలగించాలని, కేజ్వీల్స్ వినియోగం నిలిపివేయాలని, బస్ స్టాండ్ మార్పు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు, విద్యార్థులు, డ్రైవర్లకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

## బీఎస్పీ గోడ పోస్టర్ ఆవిష్కరణ

మహాధర్నాకు పిలుపు



**హుస్నాబాద్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో గోడ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ, నవంబర్ 1న ఇందిరా పార్క్‌లో ఇబ్రం శేఖర్ అధ్యక్షతన మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్ హామీ ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు. బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు బీసీల పట్ల చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. 'బీసీల హక్కుల కోసం పోరాడే బీఎస్పీని అధికారంలోకి తీసుకురావాలి. మహాధర్నాకు బహుజనులు పెద్ద ఎత్తున హాజరుకావాలి" అని పిలుపునిచ్చారు.

## కైలాసం గుట్టకు వెళ్లే దారి లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయండి

మున్సిపల్ కమిషనర్ మహామూద్ షేక్ కు వినతిపత్రం అందజేత.



**కల్వకుర్తి, అక్టోబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కల్వకుర్తి నుండి ఎల్లికల్ రోడ్డు వెళ్ళే మార్గంలో కైలాసం గుట్ట పై గల శివాలయానికి వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రహదారి పరిస్థితి దయనీయంగా ఉందని హిందూ ఐక్యవేదిక నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆలయానికి వెళ్లే రోడ్డులో విద్యుత్ దీపాల, డ్రైనేజీ నీటి సమస్యలు భక్తులకు ఇబ్బందులను కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భారీగా భక్తులు ఆలయానికి విచ్చేస్తారని దృష్టిలో ఉంచుకుని, శాశ్వత వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, అలాగే మానస గార్డెన్ వద్ద డ్రైనేజీ నీరు ప్రవహించే ప్రాంతాన్ని వెంటనే శుభ్రపరచాలని కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా హిందూ ఐక్యవేదిక నాయకులు తలసాని లక్ష్మారెడ్డి, పురం శేఖర్ రెడ్డి, బృంగి శ్రీనివాసులు, కుడుముల శేఖర్ రెడ్డి, సింగపాక రామకృష్ణ, కార్తికేయ, రవి, కార్తీక్ సింగ్, మహేశ్వర్ రెడ్డి, కూనా సంతోష్, గణేష్ నాయక్, మాడుగుల రాము, దేవర్ల వెంకటనారాయణ, రానదీర్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ నృత్యపోటీలలో పారమిత విద్యార్థుల ప్రతిభ



**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంతర్జాతీయ కర్ణాటిక్ మ్యూజిక్ అండ్ డ్యాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కూచిపూడి నృత్య పోటీలలో పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి అవార్డులు సాధించారు. 10వ తరగతి విద్యార్థులు అక్షయ సాయి, స్నేహారెడ్డి, 8వ తరగతి విద్యార్థులు అద్వైత, ప్రణవసాయి, హంసికా యాదవ్, హనీష, 7వ తరగతి విద్యార్థులు సాకేత్, అశ్విక్ యాదవ్‌లు మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్, ప్రశంసా పత్రాలు పొందారు. విద్యార్థులను చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, నాట్యాచార్యులు రంగాచార్యులు, కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మోడీ స్కానర్ శాలువా ఆవిష్కరణ

సిరిసిల్ల నేత కళాకారుడు విజయ్ సృజనాత్మకతకు కేంద్ర మంత్రి ప్రశంస



**సిరిసిల్ల, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిరిసిల్ల చేనేత కళాకారుడు నల్ల విజయ్ రూపొందించిన "మోడీ స్కానర్" శాలువాను కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించారు. పట్టు దారాలతో, జారీతో 32 ఇంచుల వెడల్పు, రెండున్నర మీటర్ల పొడవుతో 12 రోజుల్లో నేసిన ఈ శాలువాపై స్కానర్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేస్తే ప్రధాని మోడీ చేపట్టిన అభివృద్ధి పనుల ఫోటోలు కనిపిస్తాయని విజయ్ తెలిపారు. ఇంతకుముందు అగ్గిపెట్టెలో ఇమిడి పట్టుచీర, ఊసరవెల్లి రంగుల చీర, ఆపరేషన్ సింధూర్ శాలువా వంటి వినూత్న సృష్టులతో విజయ్ చేనేతకు కొత్త ఒరవడి తీసుకొచ్చారు. ఇటీవల ఆయన రూపొందించిన శాలువాను ప్రధాని మోడీకి స్వయంగా అందించారు.

## ప్రభుత్వ సేవల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రభుత్వ సిబ్బంది బాధ్యతాయుతంగా, నిష్పక్షపాతంగా సేవలు అందించాలని సూచించారు. నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం ప్రభుత్వ సేవల్లో కీలకమని పేర్కొన్నారు. విజిలెన్స్ హెల్ప్‌లైన్ 14432 పోస్టర్‌ను ఆవిష్కరించి, అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు, విజిలెన్స్ ఎస్పీ, ఆర్డీవో, జెడ్పీ సీఈవో తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ ఐక్యత మార్చ్ విజయవంతం చేయాలి



**హుజురాబాద్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా అక్టోబర్ 31న కరీంనగర్‌లో నిర్వహించే ఐక్యత మార్చ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు ఆధ్వర్యంలో శిశుమందిర్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.
ఈ కార్యక్రమంలో రావుల వేణు, తుముల శ్రీనివాస్, గంగిశెట్టి రాజు, సబ్బని రమేష్, అంకటి వాసు, పారుపల్లి కొండల్ రెడ్డి, డోరి ఐలయ్య, క్యాస వెంకటేష్, రాజేష్ ఖన్నా, మాడిశెట్టి మల్లేశం, గుర్రం సంతోష్, తూర్పాటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తీగలగుట్టపల్లిలో ఘనంగా ఛత్ పూజ



**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తీగలగుట్టపల్లి 2వ డివిజన్‌లో ఉత్తరప్రదేశ్ వాసులు ఛత్ పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. బతుకమ్మ కుంట వద్ద జరిగిన వేడుకల్లో బీజేపీ మాజీ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# నవజాత శిశు సంరక్షణపై శిక్షణ ప్రారంభం



**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో నవజాత శిశు సంరక్షణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.
నర్సింగ్ ఆఫీసర్లు, మహిళా హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలకు శిశువులకు తక్షణ పరిచర్యలపై అవగాహన కల్పించారు. శిక్షకులుగా డాక్టర్ సంధ్య, డాక్టర్ మనీషా, డిపిహెచ్ఎన్ఓ విమల వ్యవహరించారు. సొసైటీ ఆఫ్ మిడ్ వైఫ్ ఇండియా ఆధ్వర్యంలో, హిమాలయ వెల్నెస్ కంపెనీ సౌజన్యంతో కార్యక్రమం జరిగింది. డాక్టర్ ఉమాశ్రీ, రాజగోపాల్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# 30న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర బంద్

## విద్యార్థుల మద్దతు కోరిన నాయకులు



**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంకమ్మతోటలో జరిగిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. ప్రభుత్వం హామీలు తుంగలో తొక్కుతోంది" అని విమర్శించారు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ప్రొఫెషనల్, ప్రభుత్వ యూనివర్సిటీల విద్యార్థులు బంద్‌కు మద్దతు తెలపాలని కోరారు. "విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే సీఎం ఇంటిని లక్షలాది మంది విద్యార్థులు ముట్టడిస్తారు" అని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోసం వందల కోట్లు ఖర్చు చేస్తూ విద్యార్థుల కష్టాలను ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారుఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్, ఉపాధ్యక్షులు వినయ్ సాగర్, ఆకాష్, కమిటీ సభ్యులు సందేశ్, రాకేష్, నాయకులు నరేష్, సన్నీ, రఘు తదితరులు పాల్గొన్నారు.

# బాల సదన్, శిశుగృహ సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి




**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేష్ బాల సదన్, శిశుగృహాలను సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించి క్రమశిక్షణతో చదువుకుని ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఆహార నిల్వ గదులు తనిఖీ చేసి, ఆరోగ్య సమస్యలపై శ్రద్ధ వహించాలని, ఉద్యోగ కొరత ఉన్నట్టు గుర్తించారు. పిల్లలకు పండ్లు పంపిణీ చేసి, న్యాయ సేవ అవసరమైతే సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

# చెస్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అల్ఫోర్స్ విద్యార్థులు



**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు పి. విశ్వంత్ (అండర్ 17), వి. అభిరామ్, శివస్ (అండర్ 14) ఎస్‌జీఎఫ్ జోనల్ చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యాసంస్థల అధినేత వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా రంగంలో శిక్షణ, ప్రోత్సాహం అందించాలన్నారు. విజేతలకు పుష్పగుచ్ఛాలు అందజేసి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 36వ సారి రక్తదానం చేసిన ముస్తఫా

**గోదావరిఖని, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సింగరేణి ఏరియా హాస్పటల్‌లో అత్యవసరంగా ఏబీ పాజిటివ్ రక్తం అవసరమైన సందర్భంలో రామగుండం కార్పొరేషన్ 44వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎండీ ముస్తఫా 36వ సారి రక్తదానం చేశారు. ఈ సేవా భావానికి పలువురు అభినందనలు తెలియజేశారు. మానవత్వం మరిచిపోని ముస్తఫా సేవా మనసు యువతకు ప్రేరణగా నిలుస్తుందని ప్రశంసించారు.

# యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంద గణేష్



**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిజామాబాద్‌లో జరిగిన యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో కరీంనగర్ జిల్లా కార్యదర్శి సంద గణేష్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. విద్యార్థి ఉద్యమాల్లో ఆయన సేవలను గుర్తించి ఈ పదవికి ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని, స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల వరకు ఉద్యమం కొనసాగుతుందని సంద గణేష్ పేర్కొన్నారు. ఈ మహాసభల్లో అల్లెపు అభిలాష్, బూస మనితేజ, హిమంత్ వాణి, రాణి రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

# యాచారం పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్



**యాచారం, అక్టోబర్ 28 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా యాచారం సిఐ నందీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఓపెన్ హౌస్ సందర్భంగా చైతన్య స్కూల్ విద్యార్థులకు రిసెప్షన్ , సీసీ కెమెరాలు నిర్వహణ, లాకప్, పోలీస్ స్టేషన్ పనితీరు పై విద్యార్థులకు ... పోలీస్ విధులు చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు ఎస్సైలు ,ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సైక్లింగ్ పోటీలో హుస్నాబాద్ విద్యార్థులకు గోల్డ్ మెడల్



**హుస్నాబాద్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిద్దిపేటలో జరిగిన జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలో హుస్నాబాద్ కళాశాల విద్యార్థులు నీలి జస్వంత్, బళ్ళు నిఖిల్, ఎన్. రఘువంశి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. వీరి విజయంపై ప్రిన్సిపాల్ సిహెచ్ గంగాధర్, అధ్యాపక బృందం, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో కూడా పతకం సాధించాలని ఆకాంక్షించారు.

# కబడ్డీ పోటీల్లో హుస్నాబాద్ విద్యార్థికి బంగారు పతకం



**హుస్నాబాద్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పటాన్‌చెరువు మైత్రి గార్డెన్స్‌లో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో హుస్నాబాద్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాల 8వ తరగతి విద్యార్థి నూనె దివాకర్ ఉమ్మడి మెదక్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించాడు. విజయాన్ని పురస్కరించుకుని గ్రంథాలయం చైర్మన్ కేడేమ్ లింగమూర్తి, హెచ్ఎం వాసుదేవరెడ్డి, సీనియర్ క్రీడాకారులు ఎండి హసన్ శాలువాతో సన్మానించారు. శిక్షణ ఇచ్చిన పిడి ఆర్ శ్రీనివాస్, కోచ్ కృష్ణను అభినందించారు.

# పోక్సో కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష



**జగిత్యాల, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొడిమ్యాల మైనర్ బాలికపై అత్యాచారం చేసిన లంక దాసరి మల్లేశంకు జగిత్యాల న్యాయమూర్తి నారాయణ 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.25,000 జరిమానా విధించారు. 2021లో పోక్సో, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

# మేరా యువభారత్ పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ




**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సర్దార్‌ఏ150 సందర్భంగా అక్టోబర్ 31 నుంచి నవంబర్ 25 వరకు కరీంనగర్ జిల్లా మేరా యువభారత్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ అధ్యక్షతన జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కరీంనగర్, హుజురాబాద్‌లలో 500 మంది యువత, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొననున్న ఈ యాత్ర విజయవంతం కావాలని అధికారులను ఆదేశించారు. వాల్ పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

# గుండె ఆపరేషన్ కోసం రక్తదానం

- 67వ సారి ఓ నెగటివ్ దానం చేసిన బేతి మహేందర్ రెడ్డి




**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీజేపీ నేత, న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి అత్యవసర పరిస్థితిలో ఓ నెగటివ్ రక్తాన్ని దానం చేసి 70 ఏళ్ల గుర్రం ఆగయ్యకు ప్రాణాధారం అయ్యారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామానికి చెందిన ఆగయ్య గుండె ఆపరేషన్ కోసం కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతుండగా, బ్లడ్ బ్యాంక్ ద్వారా సంప్రదించిన వెంటనే మహేందర్ రెడ్డి స్పందించి రక్తదానం చేశారు ఇది ఆయన 67వ రక్తదానం కాగా, గత 31 ఏళ్లుగా ఓ నెగటివ్ రక్తంతో పాటు ప్లేట్‌లెట్స్, ప్లాస్మా దానం చేస్తూ అనేక మందికి జీవదానం చేశారు."రక్తదానం చేయండి – ప్రాణదాతలుగా నిలవండి" అంటూ ఆయన పిలుపునిచ్చారు. "ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చు. రోగి ప్రాణాలతో పాటు కుటుంబాన్ని కూడా రక్షించగలుగుతాం" అని తెలిపారు.బీజేపీ శ్రేణులు, న్యాయవాదులు, 40వ డివిజన్ వాస్తవ్యులు, శ్రేయోభిలాషులు మహేందర్ రెడ్డిని అభినందించారు.

# కళాకారులకు గుర్తింపు కార్డులు పెన్షన్లు మంజూరు చేయాలి



**హుస్నాబాద్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిరుమల నగర్‌లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా వృత్తి కళాకారుల సంఘం సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం కళాకారుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షురాలు తాళ్లపెల్లి వెంకటలక్ష్మి గౌడ్ డిమాండ్ చేశారు. "వృద్ధ కళాకారులకు పెన్షన్లు, పేద కళాకారులకు ఇళ్లు, ఉచిత ఆరోగ్య కార్డులు, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి. భాషా సాంస్కృతిక శాఖ ద్వారా గుర్తింపు ఇవ్వాలి. కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందించాలి" అని ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్ జిల్లాకు కళాకారుల కృషిలో ప్రత్యేక స్థానం ఉందని, మలిదశ ఉద్యమంలో వారి పాత్ర అపూర్వమని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంఘ బలోపేతానికి కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వచ్చే నెలలో హైదరాబాదులో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి సిల్వర్ గోల్డ్ అవార్డు గ్రహీత వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, "కళాకారులు ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాడాలి. తెలంగాణ ఉద్యమం అంటేనే కళాకారుల ధూంధాం గుర్తొస్తుంది" అని అన్నారు. సంఘ బలోపేతానికి తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దాట్ల నిర్మల, ఎద్దు మమత, మల్యాల కొమురయ్య, న్యాతరి పద్మ, బూడిద అనసూర్య, శ్యామల, రమాదేవి, చిలక రజిత, మిడిమిల్లి రేణుక తదితర కళాకారులు పాల్గొన్నారు.

# త్రీ టౌన్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

విద్యార్థులకు అవగాహన



**కరీంనగర్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసు కమిషనర్ గౌష్ ఆలం ఆధ్వర్యంలో నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని పోలీసు వ్యవస్థపై అవగాహన పొందారు. షీ టీం, సైబర్ క్రైమ్, యాంటీ నార్కోటిక్ సెల్, ట్రాఫిక్ విభాగాల స్టాల్స్ ఏర్పాటు చేసి, విధి నిర్వహణలో ఉపయోగించే పరికరాలు, నేర నివారణ పద్ధతులు వివరించారు. సైబర్ నేరాలపై జాగ్రత్తలు, ఫిర్యాదు ప్రక్రియపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అమరవీరుల వారోత్సవాల్లో ప్రజల భాగస్వామ్యం కోసం అక్టోబర్ 31 వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. "విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారోత్సవాలను విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు.

# నాగర్ కర్నూల్ పోలీస్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్



**నాగర్ కర్నూల్, అక్టోబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
7వ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయం మరియు పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విభాగాల వారీగా అన్ని రికార్డులను పరిశీలించి, సక్రమంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. "మంచిగా పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి" అంటూ సలహాలు, సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ అశోక్ రెడ్డి, డీసీఆర్బీ సీఐ ఉపేందర్ రావు, ఎస్బీసీఐ కనకయ్య, ఆర్ఐ జగన్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరులకు ఘన నివాళ్ళు



**ఇబ్రహింపట్నం అక్టోబర్ 28( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రాచకొండ కమిషనరేట్ ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఆదిభట్ల సిఐ రవికుమార్, ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో యువజన సంఘాలు పోలీసులు, అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్, మాట్లాడుతూ.. అక్టోబర్ 21 నుండి ఈ నెల వరకు 31 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసులకి పది రోజులపాటు సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయవద్దని సూచించారు. లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేని వాహనాలను నడపవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చెర్నోబిల్ పరిసరాల్లో వింత..

## నీలిరంగులోకి మారిన కుక్కలు



**న్యూఢిల్లీ: అక్టోబర్ 28( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఉక్రెయిన్ లోని చెర్నోబిల్ అణు విద్యుత్ కేంద్రం పరిసరాల్లో ఓ వింత చోటుచేసుకుంది. అక్కడి కొన్ని కుక్కలు ప్రకాశవంతమైన నీలి రంగులోకి మారాయి. ఆ వింత ఫోటోలను 'డాగ్స్ ఆఫ్ చెర్నోబిల్' అనే స్వచ్ఛంద సంస్థ పంచుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ పరిణామం శాస్త్రవేత్తలను, స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది.1986లో చెర్నోబిల్ అణు విపత్తు తర్వాత యజమానులు వదిలివెళ్లిపోయిన పెంపుడు జంతువుల సంతతికి చెందినవే ఈ శునకాలు. మానవ సంచారం లేని ఈ ప్రాంతంలో వన్యప్రాణులతో పాటు ఇవి జీవిస్తున్నాయి. ఇక్కడి దాదాపు 700 కుక్కలకు 'డాగ్స్ ఆఫ్ చెర్నోబిల్' సంస్థ ఆహారం, ఆశ్రయం, వైద్య సేవలు అందిస్తోంది. ఇటీవలే రొటీన్ స్టెరిలైజేషన్, వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా మూడు కుక్కలు ఇలా వింతగా నీలి రంగులో కనిపించాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు.వారం రోజుల క్రితం వరకు అవి సాధారణంగానే ఉన్నాయని స్థానికులు చెప్పడంతో ఈ మార్పుపై ఆసక్తి పెరిగింది. ఈ కుక్కలు ఏదైనా తెలియని రసాయన పదార్థాన్ని తాకడంవల్లే వాటి బొచ్చు రంగు మారి ఉండవచ్చని సంరక్షకులు అనుమానిస్తున్నారు. పారిశ్రామిక రసాయనాలు లేదా పర్యావరణంలోని భారీ లోహాల ప్రభావం కూడా కారణం కావచ్చని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. అసలు కారణం తెలుసుకునేందుకు పరిశోధకులు వాటి బొచ్చు, చర్మం, రక్త నమూనాలను సేకరించే పనిలోపడ్డారు.

# బీహార్‌లో ఇంటికో ఉద్యోగం

## అధికారంలోకి రాగానే అమలు
## మహాఘట్‌బంధన్ మేనిఫెస్టో విడుదలలో తేజస్వి



**పాట్నా, అక్టోబర్ 28( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
బిహార్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను విపక్ష మహాగట్‌బంధన్ మంగళవారం నాడు విడుదల చేసింది. 'బిహార్ కా తేజస్వి ప్రణ్ పత్ర'అనే టైటిల్‌తో ఆర్జేడీ నేత, కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్, కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. 'నూతన, అభివృద్ధి చెందిన బిహార్' తమ విజన్ అంటూ ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని మేనిఫెస్టో వాగ్దానం చేసింది. 20 రోజుల్లో ప్రతి కుటుంబంలోని ఒక వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని తెలిపింది. జీవికా దీదీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా శాశ్వత హోదా కల్పిస్తామని ప్రకటించింది. కాంట్రాక్టు కార్మికులు, ఔట్‌సోర్సింగ్ వర్కర్లను పెర్మనెంట్ చేస్తామని, పాత పెన్షన్ పథకాన్ని తిరిగి తీసుకువస్తామని తెలిపింది. రైతులు పండించిన పంటలన్నింటికీ కనీస మద్దతు ధర ఇస్తామని, మండీ, మార్కెట్ కమిటీలు పునరుద్ధరిస్తామని పేర్కొంది. జన్ స్వాస్థ్య సురక్ష యోజన కింద ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షల ఉచిత ఆరోగ్య బీమా కల్పిస్తామని, జనాభాకు అనుగుణంగా 50 శాతం రిజర్వేషన్‌ను పెంచుతామని హామీ ఇచ్చింది. తేజస్వి యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్డీయే నేతల ప్రసంగాలు వినే ఉంటారని, ఒక్క నేత కూడా బీహార్‌ను ఎలా ముందుకు తీసుకువెళ్తారో చెప్పడం లేదని అన్నారు. నితీష్‌కుమార్‌ను ఎన్డీయే కీలుబొమ్మగా పేర్కొన్నారు. బిహార్ సీఎం నితీష్‌కుమార్‌ను ఎన్నికల కోసమే బీజేపీ వాడుకుం టోందని, నితీష్ బిహార్ సీఎం కారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇప్పటికే ధ్రువీకరించారని, ఎన్నికల తర్వాత బీజేపీ నితీష్‌ను సీఎం చేసే ప్రసక్తే లేదని అన్నారు. ఇండియా కూటమి తనను సీఎం అభ్యర్థిగా ప్రకటించిందని, కానీ ఎన్డీయే ఒక్క మీడియా సమావేశంలో కూడా తమ సీఎం అభ్యర్థి ఎవరో ప్రకటించలేదని అన్నారు. కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహాగట్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థిని ముందుగా తామే ప్రకటించామని, ఇప్పుడు ఎన్నికల మేనిఫెస్టోను కూడా మొదటగా తాము విడుదల చేశామని చెప్పారు. దీనిని బట్టే బిహార్ విషయంలో తామెంతో కృతనిశ్చయంతో ఉన్నామో అర్థం చేసుకోవచ్చన్నారు. తొలి రోజు నుంచి బిహార్‌కు ఏమి చేయదలచుకున్నామో డిసైడ్ చేసుకున్నామని, బిహార్‌కు తిరిగి పట్టాలపైకి తీసుకువస్తామని చెప్పారు. మహాగట్‌బంధన్ 'ప్రాణ పత్ర' కోసం బిహార్ రాష్ట్రం ఎదురుచూస్తోందని, ఈరోజు తమకు శుభదినమని అన్నారు. మహాగట్‌బంధన్ ఉప ముఖ్యమంత్రి అభ్యర్థి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ చీఫ్ ముఖేష్ సహానీ మాట్లాడుతూ, నవీన బీహార్ కోసం సంకల్ప పత్రాన్ని ఈరోజు విడుదల చేశామని, రాబోయే 30-35 సంవత్సరాల పాటు బిహార్ ప్రజలకు సేవలందిస్తామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలను తాము నెరవేరుస్తామని, ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని వాగ్దానం చేశారు. రాష్ట్ర ప్రజలంతా మహాగట్‌బంధన్‌కు మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. ఎన్డీయేకు ఎలాంటి సంకల్పం లేదని, రాష్ట్రంలో ప్రభుత్వాన్ని హాగట్‌బంధన్ ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# గాజాకు 20 వేల మంది పాక్ సైనికులు!

**ఇస్లామాబాద్ అక్టోబర్ 28( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**



ఇజ్రాయెల్-పాకిస్థాన్ సంబంధాల్లో అనూహ్య మార్పు రాబోతున్నట్టు వార్తా కథనాలు వెలువడుతున్నాయి. శాంతి స్థాపన కోసం గాజాస్ట్రిప్‌కు పాకిస్థాన్ 20వేల మంది సైనికులను అక్కడికి పంపబోతున్నదట. ఇందుకు సంబంధించి ఇజ్రాయెల్, అమెరికా నిఘా ఏజెన్సీలు మొస్సాద్, సీఐఏలతో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ రహస్య ఒప్పందం చేసుకున్నట్టు 'సీఎన్ఎన్-న్యూస్ 18' వార్తా కథనం పేర్కొన్నది.ఇంతకుముందు ఎన్నడూ లేనట్టుగా ఇజ్రాయెల్ సెక్యూరిటీ ఆపరేషన్‌లో పాకిస్థాన్ భాగస్వామ్యం కాబోతున్నదని వార్తా కథనం పేర్కొన్నది. ఇజ్రాయెల్ దేశాన్నే అధికారికంగా గుర్తించని పాకిస్థాన్, అంతర్జాతీయ దళానికి తన వంతుగా వేలాది మంది సైనికులను పంపటం గమనార్హం.

# వికీపీడియాకు పోటీగా గ్రోకీపీడియా

**వాషింగ్టన్, అక్టోబర్ 28( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**




ఏఐ (కృత్రిమ మేధ) ఆధారిత ఎన్‌సైక్లోపీడియాగా తీసుకొచ్చిన 'గ్రోకీపీడియా' వెబ్‌సైట్‌ను అమెరికా కుబేరుడు ఎలాన్ మస్క్ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఆయనకు చెందిన 'ఎక్స్ఏఐ' కంపెనీ ద్వారా వికీపీడియాకు పోటీగా 'గ్రోకీపీడియా'ను రూపొందించారు. 'నిజాయతీ, పక్షపాతం లేని ఆప్షన్'గా గ్రోకీపీడియాను మస్క్ పేర్కొన్నారు.సత్యాన్వేషణలో జ్ఞాన స్థావరంగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రోకీపీడియాలోని ఏఐ చాట్‌బాట్, రియల్ టైమ్ డాటాపై ఆధారపడి పనిచేస్తుందని తెలిపారు. ఇందులోని ఇంటర్‌ఫేస్ చాలా సింపుల్‌గా ఉంది. హోమ్‌పేజీలో 'గ్రోకీపీడియా వీ 0.1' అనే సెర్చ్ బార్ కనిపించింది.